RNI NO : APTEL/2013/54450

నగరనిజం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు విలేకరులు కావలెను ఆసక్తి ఉన్నవారు ఈ క్రింది నెంబర్ ఫోన్‌కి చేయగలరు : ☎8247467562
Email Id : nagaranijam@gmail.com
Website : www.nagaranijam.com

# నగరనిజం

www.nagaranijam.com
అక్షరనిజం నగరనిజం
తెలుగు దిన పత్రిక

NN NEWS నగరనిజం

| సంపుటి : 13 | సంచిక : 27 | రంగారెడ్డి | సంపాదకులు : ఏలె. పురుషోత్తం | 20 ఆదివారం,ఏప్రిల్,2025 | పేజీలు : 4+ | ₹ 3 |
|---|---|---|---|---|---|---|

Published From Rangareddy,Circulated by Hyderabad, Nalgonda, Khammam, Karimnagar, Warangal, Mahaboobnagar, Medak, Nizamabad, Adilabad

## జపాన్‌తో అవగాహన ఒప్పందాలు

### తెలంగాణ యువతకు 500 అంతర్జాతీయ ఉద్యోగాలు





హైదరాబాద్ / నగరనిజం : తెలంగాణ యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని "తెలంగాణ రైజింగ్" బృందం జపాన్‌కు చెందిన ప్రముఖ సంస్థలతో విజయవంతంగా చర్చలు జరిపింది. తెలంగాణ ప్రభుత్వ కార్మిక, ఉపాధి, శిక్షణ మరియు కర్మాగారాల శాఖ ఆధ్వర్యంలోని తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (టి.ఓ.ఎం.కామ్), జపాన్‌కు చెందిన టెర్న్ గ్రూప్ (టీ.జి.యూకే టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్), రాజ్ గ్రూప్‌లతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి సమక్షంలో ప్రభుత్వ అధికారులు, కంపెనీల ప్రతినిధులు ఒప్పందాలపై సంతకాలు చేశారు.ఈ ఒప్పందాల ద్వారా రాబోయే 1%-%2 సంవత్సరాల్లో జపాన్‌లో 500 ఉద్యోగాలు లభించనున్నాయి. వీటిలో ఆరోగ్య సంరక్షణ రంగంలో 200, ఇంజనీరింగ్ రంగాల్లో 100, ఆతిథ్య రంగంలో 100, నిర్మాణ రంగంలో 100 ఉద్యోగాలు ఉన్నాయి.జపాన్‌లో టోక్యో కేంద్రంగా పనిచేస్తున్న టెర్న్ గ్రూప్, సాఫ్ట్‌వేర్, ఇంజనీరింగ్, స్పెసిఫైడ్ స్కిల్డ్ వర్కర్ నియామకాల్లో గుర్తింపు పొందింది. రాజ్ గ్రూప్, నర్సింగ్ కేర్ సంస్థ సుకూయి కార్పొరేషన్‌తో కలిసి కేర్ టేకర్ల శిక్షణ, నియామకాలలో ఇప్పటికే టి.ఓ.ఎం.కామ్‌తో కలిసి పనిచేస్తోంది. తాజా ఒప్పందం ద్వారా ఈ భాగస్వామ్యం మరిన్ని రంగాలకు విస్తరించనుంది.యువతకు నైపుణ్య శిక్షణతో పాటు అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇది ఉదాహరణగా నిలుస్తోంది.

## తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామ్యమవాలని ప్రవాసులను కోరిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి







హైదరాబాద్/ నగరనిజం :తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు పెట్టడంతో పాటు అన్ని విధాలుగా సహకారం అందించి రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములవ్వాలని ప్రవాస భారతీయులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. మూసీ నది శుద్ధి,మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల అభివృద్ధి వంటి ప్రాజెక్టులు రాష్ట్ర పురోగతికి ఎంతో కీలకమని ఆయన స్పష్టంచేశారు. ఈ ప్రాజెక్టుల అమలులో ప్రవాసుల సహకారం ఎంతో అవసరమని అన్నారు. అభివృద్ధి లక్ష్య సాధన కోసం ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రవాసులు తమ వంతు సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. పరిశ్రమలు స్థాపించడంవల్ల పెట్టుబడులు పెరిగి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని, ఇదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని ఆయన తెలిపారు.జపాన్ పర్యటనలో భాగంగా టోక్యో నగరంలో జపాన్ తెలుగు సమాఖ్య నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ముఖ్యమంత్రి, ప్రపంచంతో పోటీ పడే విధంగా తెలంగాణను అభివృద్ధి చేయాలని అన్నారు. సొంత ప్రాంత అభివృద్ధిలో పాల్గొనడంలో విశేష ఆనందం ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.న్యూయార్క్‌లో హడ్సన్ రివర్ ఫ్రంట్, లండన్‌లో థేమ్స్, సియోల్ నగరంలో రివర్ ఫ్రంట్లతో పాటు టోక్యోలో వాటర్ ఫ్రంట్ ప్రాంతాలను పరిశీలించిన విషయాన్ని గుర్తు చేస్తూ, ఇదే తరహాలో హైదరాబాద్ నగర అభివృద్ధికి మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టామని చెప్పారు. కాలుష్యం వల్ల ఢిల్లీ నగరం ఎదుర్కొంటున్న సమస్యల్ని దృష్టిలో ఉంచుకుంటూ హైదరాబాద్‌ను ముందుగానే సిద్ధం చేస్తున్నట్టు తెలిపారు.మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల వంటి ప్రాజెక్టులు తెలంగాణ అభివృద్ధికి కీలకమైనవని పేర్కొన్నారు. ఇప్పటికే ఐటీ, ఫార్మా రంగాల్లో ప్రగతి సాధించిందని, ఇప్పుడు ఇతర రంగాల్లో కూడా అభివృద్ధికి కృషి జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జపాన్ తెలుగు సమాఖ్య ప్రతినిధులు, టోక్యో నగరంలో నివసిస్తున్న ప్రవాస తెలుగు వ్యక్తులు పాల్గొన్నారు.

## నిమ్స్ ఎమర్జెన్సీ విభాగంలో అగ్నిప్రమాదం





హైదరాబాద్/ నగరనిజం : నిమ్స్ ఆసుపత్రిలో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. శనివారం నిమ్స్ ఆస్పత్రి ఐదో అంతస్తులోని ఎమర్జెన్సీ విభాగంలో భారీగా మంటలు ఎగిసిపడాయి. ఆస్పత్రి పరిసర ప్రాంతంలో భారీగా పొగ కమ్ముకోవబంతో రోగులు, సిబ్బంది బయటకు పరుగులు తీశారు. ఆస్పత్రి ఐదో అంతస్తులోని మంటలు అటుకున్నట్లు గమనించిన సిబ్బంది వేంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అదించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటన స్థలికి చేరుకొని సహాయక చర్యలు ప్రారంభించాయి. అగ్ని ప్రమాదానికి గల పూర్తి వివరాలు ఇంక తెలియాల్సి ఉంది.

## బీఆర్ఎస్ ఆవిర్భావ సభ....

## తెలంగాణ ప్రజల ఇంటి పండుగ



హైదరాబాద్/ నగరనిజం : హైదరాబాద్‌లోని కాలనీలు, బస్తీల్లో పార్టీ జెండా ఎగురవేసి, 27న జరిగే ఆవిర్భావ సభ కోసం దండులా కదలాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. 27న జరిగే బీఆర్ఎస్ ఆవిర్భావ సభ తెలంగాణ ప్రజల ఇంటి పండుగ అని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ నేతలు, కార్యకర్తలతో తెలంగాణ భవన్‌లో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ సన్నాహక సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలను బహిష్కరిస్తామన్నారు. కౌన్సిలర్లకు విప్ జారీ చేస్తామని, ధిక్కరించిన వారిపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. రేవంత్ రెడ్డి పిచ్చి పనులతో కాంగ్రెస్ పార్టీ పట్ల ప్రజల్లో అసహ్యం పెరుగుతుందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజలే బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తారని కేటీఆర్ అన్నారు.బీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మరోసారి రాష్ట్రాన్ని నడిపిస్తారని, తెలంగాణ రాజకీయాల్లో బలమైన శక్తిగా పార్టీ స్థానాన్ని బలోపేతం చేస్తారని స్పష్టం చేశారు. డీలిమిటేషన్ సంభావ్య ప్రభావాన్ని హైలైట్ చేస్తూ, గ్రేటర్ హైదరాబాద్ అసెంబ్లీ, పార్లమెంటరీ స్థానాల పెరుగుదలను చూడవచ్చని, ఈ ప్రాంతంలో పార్టీ ప్రభావాన్ని మరింత పటిష్టం చేస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లో బీఆర్ఎస్ బలమైన ఉనికిని నొక్కిచెప్పిన ఆయన కాంగ్రెస్, బీజేపీ వంటి జాతీయ పార్టీలను మించిపోయిందన్నారు. ఈ సన్నాహక సమావేశంలో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టంతో రైతులకు భద్రత

- మే 1 నుండి ప్రతి రెవెన్యూ గ్రామాలకు అధికారులు వచ్చి దరఖాస్తులు స్వీకరణ
- అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి పేదలకు రైతులకు సేవలించాలి
- భూభారతి చట్టం గురించి ప్రజలకు, రైతులకు అవగాహన
- నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి: ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి
- రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి




హైదరాబాద్ / నగరనిజం :భూభారతి 2025 చట్టం రైతులకు భద్రత కల్పిస్తుందని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ప్రతి రైతుకు భరోసా భద్రత కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు ఎమ్మెల్యేలతో కలిసి భూభారతి చట్టాన్ని రూపొందించడం జరిగిందని మంత్రి తెలిపారు. శనివారం భూభారతి చట్టం గురించి ప్రజలకు, రైతులకు అవగాహన కల్పించేందుకు గాను ధరూర్ మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన అవగాహన సదస్సు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గతంలో ధరణి వల్ల ఎంత ఇబ్బంది కలిగిందో రైతులకు తెలుసని దానిని దృష్టిలో ఉంచుకొని భూభారతి కొత్త చట్టాన్ని రూపొందించినట్లు తెలిపారు. రాష్ట్రంలో నాలుగు పైలట్ ప్రాజెక్టుగా ఏర్పాటు చేసి భూభారత చట్టం అవగాహన కల్పించి భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నమని తెలిపారు.సాదా బైనామాలతో పాటు ఇతర ఏ సమస్య ఉన్న పరిష్కరిస్తామని తెలిపారు. పేర్లు, సర్వే నంబర్లు, ఎకరాలు తప్పు పడిన గతంలో కార్యాలయాలు చుట్టూ తిరిగిన పనులు కాలేదని ప్రస్తుతం చట్టం ద్వారా పరిష్కరిస్తామని తెలిపారు. ఒక రూపాయి చెల్లించకుండా రైతులు నేరుగా తహసిల్దార్, ఆర్డీవో, కలెక్టర్ల ద్వారా భూ సమస్యలు పరిష్కరించుకోవచ్చు అని తెలిపారు. మే 1 నుండి ప్రతి రెవెన్యూ గ్రామాలకు అధికారులు వచ్చి రైతుల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తారని తెలిపారు. ఈ చట్టంతో పాటు అవసరమైన సవరణలు చేయడానికి అవగాహన సదస్సులు నిర్వహిస్తారని తెలిపారు. ఆధార్ కార్డు లాగా భూదార్ కార్డులను ఇస్తామని మంత్రి తెలిపారు. 26 వేల సాదా బనామ దరఖాస్తులు పరిష్కరిస్తామని అన్నారు. ఈ చట్టం ద్వారా ప్రభుత్వ, అటవీ, ప్రైవేట్ భూములకు గుర్తింపు తెచ్చి భద్రపరుస్తామని తెలిపారు.అధికారులు మొక్కుబడిగా సమావేశాలు నిర్వహించరాదని హెచ్చరించారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఉగాది నుండి సన్న బియ్యం ఇస్తున్నామని, 200 యూనిట్ల కరెంటు ఉచితంగా అందజేస్తున్నామని తెలిపారు. 500 రూపాయల గ్యాస్ సబ్సిడీ అలాగే సన్నధాన్యానికి 500 బోనస్ ఇచ్చిన ప్రభుత్వం మాదేనని అన్నారు. ప్రతి నియోజకవర్గంలో 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాలలను నెలకొల్పుతున్నట్లు, కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా చేయడానికి ప్రభుత్వం ముందుకు పోతున్నదని మంత్రి తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి పేదలకు రైతులకు సేవలించాలని కోరారు.

**నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి: ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి**

నియోజకవర్గ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి కోరారు. నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్లు 3500 ఇచ్చారని ఇంకా 1000 అదనంగా పెంచాలని కోరారు. పదవి శాశ్వతం కాదని అభివృద్ధి శాశ్వతమని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో టిసిసిబి చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, గ్రంథాలయ చైర్మన్ నీలి శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్మన్ నల్ల హన్మంతు, జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, తహసిల్దార్ భూపాల్ రెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్‌లో ఘనంగా రన్‌ఫర్ జీసస్ ర్యాలీ

- ర్యాలీలో పాల్గొన్న సంఘాల ప్రతినిధులు
- ఆనందోత్సవాల మధ్య ర్యాలీ నిర్వహణ
- ఉత్సాహంగా పాల్గొన్న యువత







వికారాబాద్ జిల్లా ప్రతినిది ఏప్రిల్ 19 నగర నిజం: వికారాబాద్ లో ఘన రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని క్రిస్టియన్స్ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గుడ్ ఫ్రైడే ఈస్టర్ పర్వదినాలను పురస్కరించుకొని వికారాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం నాడు ఉదయం 7:30 గంటలకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వికారాబాద్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేష్ కుమార్ హాజరై రన్ ఫర్ జీసస్ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవాళిలు రక్షణ కోసం ఈ లోకంలో జన్మించారని, అందరిని సమానంగా చూడాలని, ప్రేమ కరుణ భావాలతో మెలగాలని, ప్రతి ఒక్కరు సేవా భావం కలిగి ఉండాలని చెప్పిన కరుణామయుడు అన్నారు, రన్ ఫర్ జీసస్ కార్యక్రమాన్ని ఏర్పాటుచేసిన, రన్ ఫర్ జీసస్ లో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సంఘాల పాస్టర్ల ప్రార్థనలతో ర్యాలీ ప్రారంభమైంది.రన్ ఫర్ జీసస్ ర్యాలీ ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఆలంపల్లి దర్గా వరకు ప్రారంభమైన ర్యాలీలో వికారాబాద్ లో ఉన్న సంఘాల ప్రజలు రోడ్డుపై నడుచుకుంటూ, మోటార్ సైకిళ్లు, కార్లు మొదలగు వాహనాలపై వెళ్తూ జెండాలను ఊపుతూ ప్రభువైన ఏసుక్రీస్తు పునరుత్థానం సందేశాన్ని గుర్తు చేసుకుంటూ రన్ ఫర్ జీసస్ శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఏసుక్రీస్తు ప్రభువు గొప్పతనాన్ని కొనియాడుతూ గీతాలాపనలు చేస్తూ ప్రభు జనన మరణ పునరుద్దానము గురించి ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో సుమారు 1000 మంది వరకు క్రైస్తవ బిడ్డలు హాజరై ప్రభువును కీర్తిస్తూ ఘనపరిచారు.

# వైభవోపేతంగా వీరభద్రేశ్వరస్వామి కళ్యాణం,రథోత్సవ ఊరేగింపు మహోత్సవం







(నగరనిజం) ఏప్రిల్ 11 రిపోర్టర్ శీను: తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ లో కొలువుదీరిన శ్రీభద్రకాళి సమేత వీరభద్రేశ్వర జాతర మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం శ్రీభద్రకాళి సమేత వీరభద్రేశ్వరస్వామికి వేదమంత్రోచ్చరణలతోఅంగరంగ వైభవంగా కళ్యాణం నిర్వహించడం జరిగింది,అలాగే వీరభద్రేశ్వర మందిరం నుండి బసవేశ్వర మందిరం వరకు డప్పుచప్పుళ్ల తో పిల్లలు,పెద్దలు, యువకులు నృత్యాలు చేస్తూ,పద్యాలు పాడుతూ,కేరళ సంప్రదాయ వాయిద్యాల తో పురవిధులగుండా వైభవోపేతంగా రథోత్సవ ఊరేగింపు నిర్వహించారు, అనంతరం వీరభద్రేశ్వర ఆలయ వద్ద బీరప్ప చరిత్ర లోని కళాకారులువివిధ పాత్రలలో లీనమై బీరప్ప పౌరాణిక నాటకాన్ని ప్రదర్శించారు.

# ఘనంగా ముమ్మదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం







(నగర నిజం ) ఏప్రిల్ 19సంగారెడ్డి జిల్లా మండలకేంద్రమైన రాయికోడ్ లోని ముమ్మదేవి అమ్మవారి ఆలయం 19వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది, ముందుగా అర్చకులు ముమ్మదేవి అమ్మవారికి అభిషేకం చేసి అలంకరణ,పూజాకార్యక్రమాలు నిర్వహించి,కుంకుమార్చన చేసి,గణపతి హోమం,పూర్ణాహుతి,మహా హారతి ఇచ్చిన తదుపరిఆలయ కమిటీ నిర్వాహకులు అన్నప్రసాదా వితరణ గావించారు.

# రాయికోడ్ మండలంలో ఘనంగా రన్ ఫర్ జీసస్ ర్యాలీ




(నగరనిజం )ఏప్రిల్ 19 నగరనిజం రిపోర్ట్ శ్రీను: గుడ్ ఫ్రైడే, ఈస్టర్ పండుగలను పురస్కరించుకుని సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండలంలోని అన్ని సంఘాల క్రైస్తవులు, యువకులు ఘనంగా రన్ ఫర్ జీసస్ బైక్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించారు. శనివారం నాడు రాయికోడ్ చౌరాస్త నుండి రాయికోడ్ మండల కేంద్రం వరకు ఏసుక్రీస్తు ప్రభువు వారి పునరుద్దానాన్ని, అందరిని సమానంగా చూడాలని, ప్రేమ, కరుణ భావాలతో మెలగాలనే ఏసు క్రీస్తు సందేశాన్ని చాటిచెబుతూ శాంతి యుతంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో , వివిధ గ్రామాల పాస్టర్లు మరియు క్రైస్తవులు యువకులు పాల్గొన్నారు.

# జిల్లాలో 17మందికి హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి అభినందించిన జిల్లా ఎస్పీ





వికారాబాద్ జిల్లా, ప్రతినిధి, ఏప్రిల్ ,19 , నగరనిజం :వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖలో సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తున్న 17 మంది పోలీస్ కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి లభించింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శనివారం నాడు ఎస్పీ కార్యాలయంలో కార్యాలయంలో నూతనంగా పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ పదోన్నతి పొందిన అధికారులందరినీ పేరుపేరున అభినందించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ..., పదోన్నతి అనేది కేవలం హోదాలో మార్పు మాత్రమే కాదని, ఇది మరింత పెరిగిన బాధ్యత అని గుర్తుంచుకోవాలని సూచించారు. హెడ్ కానిస్టేబుల్‌గా విధి నిర్వహణలో మరింత అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీ మరియు వృత్తి నైపుణ్యంతో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగుతూ, వారి సమస్యల పట్ల మానవతా దృక్పథంతో స్పందించి, చట్ట పరిధిలో వారికి సత్వర న్యాయం అందించేందుకు కృషి చేయాలని ఎస్పీ నూతన హెడ్ కానిస్టేబుళ్లకు తెలిపారు. శాంతి భద్రతల పరిరక్షణలో హెడ్ కానిస్టేబుళ్ల పాత్ర అత్యంత కీలకమని, నిబద్ధతతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని, తద్వారా జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ప్రభుత్వ నియమ నిబంధనలను, చట్టాలను గౌరవిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ, తమ పరిధిలోని జూనియర్‌సిబ్బందికిఆదర్శంగా నిలవాలని ఎస్పీ సూచించారు. పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లుతమ నూతన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తూ, వారికి ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సమావేశంలో పదోన్నతి పొందిన హెడ్ కానిస్టేబుళ్లు తమకు లభించిన గుర్తింపు పట్ల ఆనందం వ్యక్తం చేసి, జిల్లా ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, మరింత ఉత్సాహంతో పనిచేస్తామని వారు పేర్కొన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న నటి సమంత



ప్రముఖ సినీ నటి సమంత శనివారం తిరుమలలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆమె బ్యానర్ కింద నిర్మిస్తున్న శుభం చిత్రం మే 9వ తేదీన విడుదల కానుంది. ఈ నేపథ్యంలో శుభం చిత్ర బృందంతో కలిసి సమంత శ్రీవారి సేవలో పాల్గొన్నారు. శనివారం ఉదయం సమంత శుభం చిత్ర యూనిట్ సభ్యులు వీఐపీ విరామ దర్శన సమయంలో ఆలయానికి చేరుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు ఆ బృందాన్ని స్వాగతం పలికి, వారి దర్శన కోసం ఏర్పాట్లను పర్యవేక్షించారు. సమంత, చిత్ర బృందం స్వామివారిని దర్శించుకుని ముక్కులు చెల్లించుకున్నారు.దర్శనం తర్వాత వేద పండితులు రంగనాయకుల మండపంలో సమంత, శుభం చిత్ర బృందానికి ఆశీస్సులు అందించి, వారికి తీర్థ ప్రసాదాలు (పవిత్ర నైవేద్యాలు) అందజేశారు. దర్శనానికి ముందు, సమంత వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో తన డిక్లరేషన్‌ను సమర్పించుకున్నారు. సమంత గతేడాది ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్ పేరుతో తన సొంత నిర్మాణ సంస్థను ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే శుభం సినిమాను ఈ బ్యానర్ లో నిర్మించారు, త్వరలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్ర బృందంతో కలిసి ఆమె తిరుమల పర్యటన ప్రాముఖ్యతను సంతరించుకుంది.

# -రాహుల్ గాంధీ కలలను నిజం చేద్దాం-

## ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

- శంషాబాద్ (మం) కవ్వగూడ, నర్కూడ గ్రామాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్
- అంబేద్కర్ చిత్రపటాలతో పాటు రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకొని బస్తీల్లో పాదయాత్ర చేసిన నేతలు









రాజేంద్రనగర్, ఏప్రిల్ 19(నగరనిజం,ప్రతినిధి):భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం కాంగ్రెస్ యువనేత రాహుల్ గాంధీ అహోరాత్రులు శ్రమిస్తున్నారని, రాహుల్ గాంధీ లక్ష్యాలను సాధించడానికి కాంగ్రెస్ శ్రేణులు కృషి చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పిలుపునిచ్చారు. అంబేద్కర్ ప్రసాదించిన రాజ్యాంగం పుణ్యమా అని ప్రజలంతా స్వేచ్ఛా వాయువులు పీల్చుకుంటున్నారని ఆయన అభిప్రాయపడ్డారు. మరోవైపు రాహుల్ గాంధీ తలపెట్టిన జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు కృషి చేయాలని ప్రకాష్ గౌడ్ దిశా నిర్దేశం చేశారు. పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు శనివారం నాడు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలోని కవ్వగూడ, నర్కూడ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ శంషాబాద్ మండల అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ముఖ్యఅతిథిగా హాజరు కాగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జెల్లపల్లి నరేందర్ పాల్గొన్నారు. ఈ మేరకు అంబేద్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జెల్లపల్లి నరేందర్, సులోచన, శేఖర్ యాదవ్, శంషాబాద్ మండల్ మాజీ జెడ్పిటిసి నీరటి తన్విరాజు ముదిరాజ్, కాంగ్రెస్ సీనియర్ నేతలు కొడిగంటి చంద్రారెడ్డి, వెంకటేష్ గౌడ్, దండు ఇస్త్రారీ, ఆనంద్ ముదిరాజ్‌తదితర కాంగ్రెస్, ఎన్ఎస్ యుఐ నాయకులు, కార్యకర్తలంతా అంబేద్కర్ చిత్రపటాలతో పాటు రాజ్యాంగం పుస్తకాన్ని చేతుల్లో పట్టుకొని ఆయా బస్తీల్లో పాదయాత్ర నిర్వహించారు. జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ అనే నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్.... దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ని అధికారంలోకి తేవడానికి కాంగ్రెస్ యువ నేత రాహుల్ గాంధీ శ్రమిస్తున్నారని గుర్తు చేశారు. మరోవైపు రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న కృషి ఎవరు మర్చిపోలేనిది అన్నారు. కాంగ్రెస్ పార్టీలోని ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్త రాహుల్ గాంధీ ఆశయాల సాధన కోసం కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలు కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గుర్తు చేశారు. గడచిన 15 నెలల కాలంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేస్తోందని చెప్పారు. రాబోయే మూడున్నర ఏళ్ల కాలంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామని ప్రకాష్ గౌడ్ భరోసా ఇచ్చారు. రాహుల్ గాంధీ ఆశయాల సాధనకు అనుగుణంగా జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ప్రకాష్ గౌడ్ దిశా నిర్దేశం చేశారు.

**• రాజ్యాంగం వల్లనే పదవులు అనుభవిస్తున్నారు - కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్**

కేంద్రంలో అధికారంలోకి వచ్చాక మతోన్మాద భారతీయ జనతా పార్టీ నేతలు భారత రాజ్యాంగాన్ని అగౌరవ పరిచేలా మాట్లాడుతున్నారని ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ మండిపడ్డారు. రాజ్యాంగాన్ని తలుచుకోవడం కన్నా దేవుడిని తలుచుకోవడం మిన్న అంటూ సాక్షాత్తు కేంద్ర మంత్రులు పార్లమెంటు వేదికగా రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. భారతరత్న అంబేద్కర్ రచించిన భారత రాజ్యాంగం ఫలితంగానే నాయకులు పదవులు అనుభవిస్తున్న విషయాన్ని మర్చిపోరాదని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ యువనేత, పార్లమెంటులో కాంగ్రెస్ విపక్ష నేత రాహుల్ గాంధీ భారత రాజ్యాంగాన్ని పరిరక్షించడానికి కంకణం కట్టుకున్నారని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే జై భీమ్, జై బాబు, జై సంవిధాన్ నినాదంతో కాంగ్రెస్ పార్టీ గ్రామ గ్రామాన ప్రజల్లో చైతన్యం నింపడానికి కార్యక్రమాలు చేపట్టిందని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ నరేందర్, శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్, శంషాబాద్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజయ్ యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నేతలు మైలారం సులోచన, నీరటి తన్వి రాజు ముదిరాజ్, కొడిగంటి చంద్రారెడ్డి, దూడల వెంకటేష్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనంద్ ముదిరాజ్, సుల్తాన్ పల్లి మాజీ ఎంపిటిసి యాటకారి సంగీత సిద్దేశ్వర్ ముదిరాజ్, నర్కూడ మాజీ ఎంపీటీసీ గౌతమి అశోక్, సీనియర్ కాంగ్రెస్ నేతలు గుంటి ప్రవీణ్ అలియాస్ మిట్టు,మహమ్మద్ నజీర్ బాయ్, పెద్దగండు శ్రీధర్, రమేష్, సుల్తాన్ పల్లి మాజీ సర్పంచ్ దండు ఇస్త్రారీ,కవ్వగూడ మాజీ సర్పంచ్ రమేష్ యాదవ్, గణేష్ నాయక్, జగన్నాథం తదితర పార్టీ నేతలు కార్యకర్తలు పాల్గొన్నారు.

# గర్భిణీలు,బాలింతలు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలి

## -ఐసిడిఎస్ సూపర్వైజర్ గీత కుమారి-



ఏప్రిల్ 19,(నగరనిజం ప్రతినిధి): మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర మండలం లక్ష్మిపల్లి గ్రామంలో శనివారం రోజు పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ గీత కుమారి మాట్లాడుతూ గర్భిణీలు,బాలింతలు ఆకుకూరలు,గుడ్డు,పాలు లాంటి పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని అన్నారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా పోషక విలువలు కలిగిన ఆహారం అందించడం జరుగుతుంది.కావున గర్భిణీలు బాలింతలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో గర్భిణీలు,బాలింతలు,చిన్నరులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# స్నేహ మధురిమను పంచుదాం

## ప్రముఖ సాహితీవేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు బడుగు శ్రీరాములు




చౌటుప్పల్ ,ఏప్రిల్, 19, (నగరనిజం న్యూస్) : చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర బాలికల గురుకుల పాఠశాల మరియు కళాశాలలో ప్రిన్సిపల్ కే. సరోజనమ్మ అధ్యక్షతన ఒత్తిడి, వైఫల్యాలను, జీవిత సవాళ్లను ఎదుర్కొనేల విద్యార్థినిలను సిద్ధపరచడం కొరకు" చెలిమి"కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమ ముఖ్యఅతిథిగా ప్రముఖ సాహితీవేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు బడుగు శ్రీరాములు పాల్గొని ప్రసంగించారు. చెలిమి అంటే స్నేహమని, స్నేహమాధుర్యాన్ని తోటి విద్యార్థులకు పంచడం ద్వారా మానసిక ప్రశాంతతను కలిగించవచ్చునని అన్నారు. విద్యార్థినిలు అవరోధాలు కలిగినప్పుడు ధైర్యంతో ఎదుర్కోవాలని ఇతరులకు స్ఫూర్తినిచ్చేలా జీవించాలని ప్రతిరోజును, ప్రతిక్షణం ను గొప్పగా ఉపయోగపడే విధంగా చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. మనసులో విరుద్ధ ఆలోచనలు చేరకుండా ప్రతినిత్యం యోగా చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమ విశిష్ట అతిథిగా విచ్చేసిన పాలకుర్తి శివయ్య గౌడ్ స్మారక ఫౌండేషన్ చైర్మన్ పాలకొల్లు మురళి గౌడ్ మాట్లాడుతూ గురువుల ఎడల పూజ్య భావము, మరియు సమయపాలన క్రమశిక్షణను అలవర్చుకొని ఈ దశలోని ఒక లక్ష్యమును ఏర్పాటు చేసుకొని లక్ష సాధనకై కృషి చేయాలని అన్నారు. మొబైల్ ఫోన్లకు దూరంగా ఉండాలని అన్నారు. ప్రిన్సిపాల్ కే సరోజనమ్మ మాట్లాడుతూ విద్యార్థులు నిరాశ నిస్పృహలకు గురికాకుండా వినయ విజ్ఞానాలను వినమ్రతను పెంపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థినిలు వారి స్పందనను వినిపించారు. ఈ కార్యక్రమంలో ఏం.స్వాతి, బి.స్వాతి, ఆర్ నాగలక్ష్మి ఉషారాణి పద్మజ మొదలగు టీచర్లు పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులకి ఇచ్చిన హామిలను అమలు చేయాలి

## ఏప్రిల్ 21 సికింద్రబాద్ సీతాఫల్ మండి జిహెచ్ఎంసి ఫంక్షన్ హాల్లో తెలంగాణ ఉద్యమకారులు ప్లీనరి



హైదరాబాద్ ఏప్రిల్ 19 (నగరనిజం న్యూస్): తెలంగాణ ఉద్యమకారులకి ఇచ్చిన హామిలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21 సికింద్రబాద్ సీతాఫల్ మండి జిహెచ్ఎంసి ఫంక్షన్ హాల్లో తెలంగాణ ఉద్యమకారులు ప్లీనరితెలంగాణ ఉద్యమకారులు ప్లీనరిని నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్ రెడ్డిలు టే తెలిపారు. శనివారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో మిడియా సమావేశంలో వారు మాట్లాడుతూ... తెలంగాణ ఉద్యమకారులకి ఇచ్చిన హామిలను అమలు చేయాలని, (250 గజాల ఇంటి స్థలం, పెన్షన్లు) ఒక కమిటీని ఏర్పాటు చేసి తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి గుర్తింపు కార్డులు జారీ చేయాలని, తెలంగాణ సాంస్కృతిక విభాగంలో కళాకారులకి 1000 ఉద్యోగాలు కల్పించాలని, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, సంక్షేమ పథకాలలో 20 శాతం కేటాయించాలని, విద్యార్థి ఉద్యమకారులకి ఉద్యోగాలలో 5 శాతం కేటాయించాలని, మార్వాడీల ఆధిపత్యాన్ని తగ్గించాలని, తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని, తెలంగాణ సినిమా, విద్యా పాలసీలను ప్రకటించాలని, (సీమాంధ్ర ఆధిపత్యాన్ని తగ్గించడానికి) పై తెలిపిన అన్ని హామీలు జూన్ 2 తారీకు లోపు నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ మరియు ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సురేందర్ రెడ్డి అధ్యక్షతన ఈ ప్రెస్ మీట్ ముఖ్య ఉద్దేశం....నేటి కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వీరస్వామి, గగన్ కుమార్, జ్యోతి రెడ్డి, జానకిరెడ్డి, మల్లూరు అనిల్, కొంతం యాదిరెడ్డి, ఇంద్ర కుమార్, జగన్ యాదవ్, పుట్నాల కృష్ణ, నరేంద్ర గౌడ్, రాంబాబు, ఆర్కే భూపాల్, కిరణ్ కుమార్, శ్యామల, శివ్ కుమార్ నేత, చంద్రశేఖర్, జగన్, మాణిక్యం, విజయ్ కుమార్, మహమ్మద్ గౌస్, మోహన్ చారి, శ్రీనివాస్ గౌడ్, భాస్కర్, సురేందర్, లక్ష్మణ్, సికిందర్, శ్రీనివాస్ , శ్రీధర్ పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి

## - పీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ జెల్లపల్లి నరేందర్-

## విద్యార్థి దశ నుండే ప్రజలకు రాజ్యాంగంపై అవగాహన కల్పించాలన్న నరేందర్





రాజేంద్రనగర్, ఏప్రిల్ 19(నగరనిజం ప్రతినిధి) :పాఠశాలలో విద్యార్థులకు రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు జెల్లపల్లి నరేందర్ అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో పాటు ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ప్రభుత్వం దృష్టికి తేవడానికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని నరేందర్ విజ్ఞప్తి చేశారు. శనివారం నాడు రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం లోని కవ్వగూడ, నర్కూడ గ్రామాల్లో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గడ్డం శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జై భీమ్, జై బాబు, జై సంవిధాన్ కార్యక్రమంలో నరేందర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన జెల్లపల్లి నరేందర్.... భారత రాజ్యాంగం ఒక పవిత్ర గ్రంథం వంటిది అన్నారు. భారత రాజ్యాంగాన్ని అనుసరించి పౌరులకు అనేక హక్కులు సంక్రమించాయని ఆయన గుర్తు చేశారు. మరోవైపు నాయకులు, ప్రజా ప్రతినిధులు, రాజ్యాంగాన్ని అనుసరించి పదవులను పొందుతున్న విషయాన్ని మర్చిపోరాదని నరేందర్ పేర్కొన్నారు. విద్యార్థి దశ నుండే ప్రజలకు రాజ్యాంగం పై అవగాహన కలిగి ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో పాఠశాల దశ నుండే భారత రాజ్యాంగం అంశాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని నరేందర్ పేర్కొన్నారు. ప్రభుత్వం ఈ మేరకు రాజ్యాంగం అంశాన్ని పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చర్చి విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తో పాటు ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి తమ వంతు కృషి చేయాలని జెల్లపల్లి నరేందర్ విజ్ఞప్తి చేశారు. మరోవైపు రాజ్యాంగ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు.

# తెలంగాణ రాష్ట్రంలో వక్ఫ్ అమెండ్ మెంట్ అమలు చేయాలి

- బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల్ మాజీ శాసనసభ్యుడు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ డిమాండ్
- రామంతాపూర్ శివాజీ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు భారీ ర్యాలీ



హైదరాబాద్ ఏప్రిల్ 19 (నగరనిజం న్యూస్) : భారత ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇటీవల లోక్ సభ,రాజ్యసభలో ఆమోదింప జేసిన వక్ఫ్ అమెండ్ మెంట్ చట్టంను వెంటనే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలని కోరుతూ రామంతాపూర్ శివాజీ విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పల్ మాజీ శాసనసభ్యుడు ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించడం జరిగింది.కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు,బిజెపి సీనియర్ నాయకులు, మోర్చాల రాష్ట్ర నాయకులు, జిల్లా నాయకులు ,తదితర కార్యకర్తలతో పాటు పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరయం

## మహేశ్వరం విద్యుత్ అధికారి ఏఈ చక్రపాణి



మహేశ్వరం ఎప్రిల్ 19 (నగరనిజం):నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మహేశ్వరం విద్యుత్ అధికారి ఏఈ చక్రపాణి ఒక ప్రకటనలో తెలిపారు. నేడు (ఆదివారం) కందుకూరు సబ్ స్టేషన్ కు నూతనంగా విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయుటకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు రెన్యూసిస్ ప్లాస్టిక్ పార్క్ మంఖాల్ ఇండస్ట్రియల్ ఏరియా, ఫ్యాబ్సిటీ ఇండస్ట్రియల్ ఏరియా మలబార్ గోల్డ్ విప్రో ప్రీమియం రామ్కీ కావూరి హిల్స్ విశాల్ ప్రజయ్ బి టి ఆర్ ఎలక్ట్రానిక్ సిటీ ఇమామ్ గూడా మంఖాల్, శ్రీనగర్ రా రాచులూర్ గేట్ పెద్దమ్మ టెంపుల్ తదితర ప్రాంతాల్లో వ్యవసాయ రంగానికి సంబంధించిన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన తెలిపారు జేమ్స్ పార్క్ సబ్ స్టేషన్ లో అదనపు ట్రాన్స్ ఫార్మర్ ఏర్పాటు చేయుట గురించి హార్డ్వేర్ పార్క్ లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు విద్యుత్ సంస్థకు సహకరించలేని ఆయన విజ్ఞప్తి చేశారు.

# బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలి

- బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అంగోత్ రాజు నాయక్



మహేశ్వరం ఎప్రిల్ 19 (నగరనిజం): బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని మహేశ్వరం మండల్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అంగోత్ రాజు నాయక్ పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ఈ నెల 27వ తేదీన వరంగల్ ల్లో నిర్వహించే రజతోత్సవ సభ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్ ను ఆయన పార్టీ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27వ తేదీన ఉదయం ప్రతి గ్రామంలో బిఆర్ఎస్ పార్టీకి సంబంధించి జెండా ఆవిష్కరణ కార్యక్రమం ముగించుకుని ఉదయం 9 గంటలకల్లా మహేశ్వరం మండల కేంద్రానికి చేరుకొని భారీగా ర్యాలీతో వరంగల్ సభకు బయలుదేరాలని ఆయన పార్టీ నాయకులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ వర్కల యాదగిరి గౌడ్ పిఎసిఎస్ చైర్మన్ మంచే పాండు యాదవ్ హనుమగల చంద్రయ్య కర్రోల్ల చంద్రయ్య, వెంకటేశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి రాయప్ప మునుగపాటి నవీన్, దుడ్డు కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి చట్టం ద్వారా సులభంగా లావాదేవీ సేవలు

- భూభారతి చట్టంపై రైతులకు అవగాహన
- రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుద్దు
- అధికారులే రైతుల దగ్గరికి వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారు.
- జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్





వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ ,19 నగరనిజం : భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి భూ భారతి ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. శనివారం మర్పల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో భూ భారతి కొత్త ఆర్ఓఆర్ చట్టం పై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ మాట్లాడుతూ... రైతులకు తమ భూముల విషయంలో ఉన్న అభద్రత భావాన్ని తావు నీయకుండా జవాబుదారుతనాన్ని పెంచేందుకు భూ భారతి నూతన చట్టాన్ని ప్రవేశపెట్టిందని కలెక్టర్ తెలిపారు. కొత్త చట్టం ద్వారా లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, ముటేషన్, నిషేధిత భూములు, ఆర్ ఓ ఆర్ మార్పులు చేర్పులు, సాదా బైనామాలు వంటి సేవలు సులభతరం అవుతుందని ఆయన తెలిపారు.ప్రభుత్వం ప్రజలకు సరళంగా ఉండే విధంగా గ్రామీణ ప్రజల, రైతుల సమస్యలు పరిష్కారం అయ్యేలా భూ భారతి రూపొందించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రజలు ప్రభుత్వ కార్యాలయ చుట్టూ తిరగకుండా గ్రామాల్లోకి ప్రజలు దగ్గరకు అధికారులు వచ్చి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు.అవగాహన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, ఆర్డీఓ వాసు చంద్ర, తాసిల్దార్ మునీరుద్దీన్, మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి తో పాటు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# పశ్చిమ బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలి

- దిల్ సుఖ్ నగర్ రాజీవ్ చౌక్ వద్ద నిరసన ప్రదర్శన
- పెద్ద ఎత్తున పాల్గొన్న విహెచ్పి, భజరంగ్ దళ్ శ్రేణులు.



దిల్‌సుఖ్‌నగర్ ఏప్రిల్ 19 ( నగరనిజం) : పశ్చిమ బెంగాల్లో ముష్కర మూకలు హిందువుల పై దాడులు చేసి చంపడం దారుణమని, కేంద్ర ప్రభుత్వం వెంటనే అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని వి హెచ్ పి జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, వివేకానంద జిల్లా అధ్యక్షులు పురుషోత్తమ్ రెడ్డి అన్నారు. పశ్చిమ బెంగాల్లో హిందువుల పై దాడులను ఖండిస్తూ శనివారం దిల్ సుఖ్ నగర్ రహదారి పై విహెచ్ పి,భజరంగ్ దళ్ నిరసన కార్యక్రమం చేపట్టింది. వందలాది మంది విహెచ్ పి,భజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... వక్ఫ్ బోర్డు నవరణ బిల్లుకు వ్యతిరేకంగా కొందరూ ముష్కర మూకలు హిందువులపై దాడులు చేసి చంపారని, ఆస్తులను ధ్వంసం చేసి లూటీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది మంది హిందువులు ఇండ్లను ఖాళీ చేసి పోయారని తెలిపారు. మమతా బెనర్జీ హిందువులకు రక్షణ కల్పించలేకపోతున్నారని, ఓటు బ్యాంక్ కోసం దేశ భద్రతకే ఆటంకంగా మారిందని వాపోయారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం పశ్చిమ బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించి హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మాహేశ్వర్ రెడ్డి, చైతన్యపురి కార్పొరేటర్ రంగ నరసింహ గుప్తా, సరూర్ నగర్ కార్పొరేటర్ శ్రీవాణి అంజన్ కుమార్, బజరంగ్దళ్ జిల్లా అధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, జిల్లా కార్యదర్శి సుధాకర్, జిల్లా సహకార దర్శి సంజయ్ శర్మ, హిందు వాహిని రాములు, బ్రహ్మచారి, గురువయ్య, నవ్వ రాజేందర్ రెడ్డి, సుధీర్, బిజెపి నాయకులు సిద్దు రామ్ రెడ్డి బజరంగ్ దళ్ కార్యకర్తలు, బిజెపి శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

# వరిధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పూర్తి ఏర్పాట్లు చేయాలి

## రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి




మేడ్చల్ మల్కాజ్గిరి/నగరనిజం: రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి యాసంగి 2024-25 సీజన్ ధాన్యం కొనుగోలు చేస్తుందని, ఈ క్రమంలో కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ లోని సచివాలయం నుంచి రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డి. ఎస్. చౌహాన్ తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల అధికారులతో యాసంగి వడ్ల కొనుగోలు, సన్న బియ్యం పంపిణీ, త్రాగునీటి సరఫరా అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఇందులో భాగంగా యాసంగి సీజన్ లో వరి ధాన్యం కొనుగోలు కొరకు రైతులకు అందుబాటులో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. యాసంగి సీజన్ లో 70 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్దేశించడం జరిగిందని, రాష్ట్రంలో 8 వేల 329 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పటి వరకు 8 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని తెలిపారు. ధాన్యం విక్రయించేందుకు కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని, త్రాగునీరు, నీడ ఏర్పాట్లు చేయాలని, ఓ. ఆర్. ఎస్. ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. రాష్ట్రంలో అర్హులైన రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేయడం జరుగుతుందని, అధికారులు గోదాములలో ఉన్న సన్న బియ్యం నిల్వలను పరిశీలించాలని, నాణ్యత పరిశీలించాలని తెలిపారు. వేసవిలో త్రాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీటి ప్రాజెక్టుల నుండి తరలించడానికి మిషన్ భగీరథ ఇంజనీరింగ్ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు సమన్వయంతో వ్యవహరించి త్రాగునీటి సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ గౌతమ్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రణాళికా బద్ధంగా యాసంగి పంట కొనుగోలుకు చర్యలు

- రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి
- అత్యధికంగా వరి పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భావం
- ధాన్యం కొనుగోలు పై జిల్లా కలెక్టర్ లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలి
- తాళ్ళు,తరుగు పేరిట ఎటువంటి కోతలు పెట్టవద్దు
- సన్న బియ్యం సరఫరా , ధాన్యం కొనుగోలు పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.






వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 19 నగరనిజం :ప్రణాళికాబద్ధంగా యాసంగి పంట కొనుగోలు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సన్న బియ్యం సరఫరా , ధాన్యం కొనుగోలు పై పౌరసరఫరాల శాఖ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ తో కలిసి జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అకాల వర్షాలు కారణంగా రైతులు నష్టపోకుండా నాణ్యమైన ధాన్యాన్ని వేగవంతంగా కొనుగోలు చేయాలని మంత్రి సూచించారు. దేశంలో అత్యధికంగా వరి పంట పండిస్తున్న రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందని, వానాకాలంలో 153 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, యాసంగి లో 127.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పంట పండిందని అన్నారు. వానాకాలం పంట కొనుగోలు సజావుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించినందుకు కలెక్టర్లకు, అదనపు కలెక్టర్ లు, పౌర సరఫరాల అధికారులకు, ఇతర సిబ్బందికి మంత్రి అభినందనలు తెలిపారు. వాన కాలం కంటే అదనంగా యాసంగి సీజన్ లో 70 లక్షల మెట్రిక్ టన్నుల దాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని మంత్రి తెలిపారు.ధాన్యం కొనుగోలు అంశంపై జిల్లా కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించి ప్రత్యేకంగా మానిటర్ చేయాలని అన్నారు. రైస్ మిల్లర్లు తాళ్ళు, తరుగు పేరు మీద ఎటువంటి కోతలు లేకుండా జాగ్రత్తలు పాటించాలని అన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా జరిగేందుకు అధిక ప్రాధాన్యత అందించాలని , దీనికి అనుగుణంగా జిల్లాలలో ఐకెపి, ప్యాక్స్ కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలలో ఎక్కడైనా కొనుగోలు కేంద్రాలలో మౌలిక వస్తువుల కొరత ఉంటే కలెక్టర్లు వాటిని కొనుగోలు చేయవచ్చని మంత్రి తెలిపారు. భారత ఆహార సంస్థ మార్గదర్శకాలు ప్రకారం నూకల శాతం 25 దాటకుండా చూడాలని అన్నారు. ప్రభుత్వం అందించే ధర కంటే అధికంగా అందిస్తే మాత్రమే రైతులు ప్రైవేట్ గా బియ్యం అమ్ముకోవాలని, తక్కువ ధరకు ఎట్టి పరిస్థితుల్లో అమ్మడానికి వీలు లేదని అన్నారు. మన రాష్ట్రంలో అత్యధిక జనాభా దొడ్డు బియ్యం తినడం ఆపేసారని, దీనిని గమనించి రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం 84 శాతం జనాభాకు ఉచితంగా సరఫరా చేసే కార్యక్రమం చేపట్టామని అన్నారు.సన్న బియ్యం సరఫరా పంపిణీ విజయవంతం అవుతుందని, పేదలు, ప్రజలు సన్న బియ్యం సంతోషంతో స్వీకరిస్తున్నారని, 84 శాతం జనాభా ఆహార భద్రతకు సుస్థిరత ఏర్పడిందని అన్నారు.13 వేల కోట్లు ఖర్చు చేసి 30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని రేషన్ కార్డుదారులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని, ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా చూడాలని అన్నారు. సన్న బియ్యం నాణ్యత పై సామాజిక మాధ్యమాల్లో అక్కడక్కడ వస్తున్న వ్యతిరేక వార్తలను పరిశీలించి తప్పుడు వార్తలైతే వెంటనే ఖండించాలని మంత్రి అధికారులకు సూచించారు.నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో ఎక్కడైనా త్రాగు నీటి సరఫరా ఇబ్బందులు, కొరత ఎక్కడైనా ఉంటే సమాచారం అందించాలని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, సివిల్ సప్లై మోహన్ బాబు,సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# బాలుర వసతి గృహమును తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్







వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 19 నగర నిజం :వికారాబాద్ జిల్లా మోమిన్ పేట్ మండలం జిల్లా చైల్డ్ కేర్ కమిటీ అధ్వర్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు హెల్ఫ్ ఆల్ సొసైటీ (బాలుర) వసతి గృహంను తనిఖీ చేయడము జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ తెలిపారు.శనివారం జిల్లా శిశు సంక్షేమ అధికారి జయసుధ లతో కలిసి (బాలుర)వసతి గృహం ను సందర్శించి రికార్డ్స్ ను పరిశీలించారు. దార్మెంటరి , వాష్ రూంలను పరిశీలించి, సెక్యూరిటీ , పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తున్నారా, మెనూ ప్రకారము భోజనం పెడుతున్నారా, పూర్తి వివరాలు సంబంధిత వార్డెన్ లతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా మెనూ ప్రకారము వారికి ఆహారం అందించాలని, ప్రతినెల పిల్లలకు హెల్త్ చెకప్ చేయించాలని, అదేవిధంగా రికార్డ్స్ మెయింటెనెన్స్ చేయాలనీ సంబంధిత అధికారులకు ఆదేశించారు.దీని యొక్క నివేదికను జిల్లా కలెక్టర్ కి సబ్మిట్ చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమం లో జిల్లా సంక్షేమాధికారి జయసుధ మరియు సి డబ్ల్యూ సి కమిటి మెంబర్స్ ఉన్నారు.

# బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలివెళదాం

## రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి



మొయినాబాద్,19(నగర నిజం): బీఆర్ఎస్ పార్టీ నిర్వహించే రజతోత్సవ సభకు భారీగా తరలివెళ్లి విజయవంతం చేద్దామని రాష్ట్ర బీఆర్ఎస్ నాయకులు కొంపల్లి అనంతరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని అంజనాదేవి గార్డెన్లో వాల్పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్రెడ్డి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆయన పాల్గొని వాల్పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఈ నెల 27న నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేద్దామన్నారు. గ్రామ గ్రామాన నుంచి కార్యకర్తలు, నాయకులు తరలివెళ్లేందుకు కృషి చేద్దామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు దారెడ్డి వెంకట్రెడ్డి, నాయకులు ముదిగొండ రవియాదవ్, కొత్త మాణిక్రెడ్డి, అంజయ్యగౌడ్, కృష్ణమాచారి, ప్రసాద్, కృష్ణారెడ్డి, జగన్, కుమ్మరి రాము, విష్ణుగౌడ్, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల కోసం అర్హులైన వారిని ఎంపిక చేయాలి

## మున్సిపల్ కమిషనర్ ఖాజా మోహిజుద్దీన్ ఇందిరమ్మ కమిటీ సభ్యులకు అవగాహన సదస్సు



మొయినాబాద్,19 (నగర నిజం): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అర్హులైన వారికి ఇళ్లు నిర్మించేందుకు చేపట్టిన కార్యక్రమంలో నిజమైన అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేద్దామని మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ ఖాజామోహిజుద్దీన్ అన్నారు. శనివారం మున్సిపల్ పరిధిలోని హిమాయత్నగర్ పురపాలక సంఘం కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో పాటు మున్సిపల్ పరిధిలోని ఎనిమిది పురపాలక సంఘాలలో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులకు ఇందిరమ్మ ఇండ్లపై పూర్తి అవగాహన వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఖాజాముహిజుద్దీన్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల కమిటీలో ఉన్న సభ్యులు, అధికారులు కలిసి లబ్దిదారుల ఎంపికను సక్రమంగా చేయాలని సూచించారు. మున్సిపల్ పరిధిలో 542 లబ్దిదారులకు ఇండ్ల స్థలాలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. ఇందుకు గాను సమగ్ర సర్వేలో భాగంగా లబ్దిదారుల వద్దకు వెళ్లి వారి వద్ద ఆధార్ కార్డు, రేషన్ కార్డు, ఇంటి స్థలం, స్థానికులుగా గుర్తించడం, అదే విధంగా 44 గజాల కనీస స్థలం ఉండాలని తెలిపారు. లబ్దిదారులు మహిళలై ఉండాలని అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎలా సూచిస్తే అలాగే సక్రమంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రతి లబ్దిదారుడికి ఒక ఇంటికి ఐదు లక్షల రూపాయలు మంజూరవుతాయన్నారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు గడ్డం వెంకట్రెడ్డి, పురానం వీరభద్రస్వామి, సుధాకర్రెడ్డి తదితరులు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత ఇండ్లు కట్టుకున్న వారికి అర్హులుగా గుర్తిస్తారని అప్పట్లో తెలపడం జరిగిందని అనడంతో ప్రభుత్వం ఎలాంటి గైడ్లెన్స్ ఇస్తే అలాగే అమలు చేయడానికి కృషి చేస్తామని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ అధికారులు మహ్మద్ జమీల్, సంధ్యారాణి, వెంకటేశ్వర్రెడ్డి, వెంకటేష్, శ్రీనివాస్, గెజిటెడ్ ప్రధానోపధ్యాయులు నర్సింహులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పురానం వీరభద్రస్వామి, గడ్డం వెంకట్రెడ్డి, రమేష్, టిల్లు, సుధాకర్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక
- రూ. లక్ష చొప్పున తొలి దశ బిల్లుల మంజూరు.....
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



వికారాబాద్ జిల్లా ప్రతినిధి ఏప్రిల్ 19 నగరనిజం :తెలంగాణ రాష్ట్రంలో పేదల సొంతింటి కల ఆశయాన్ని సాకారం చేసేందుకు గాను ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం తీసుకొచ్చిందని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ శనివారం వారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పథకంలో భాగంగా నిరుపేదలైన అర్హులకే ఇళ్లు మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు అనుగుణంగా ప్రతి మండలంలోని ఒక గ్రామం చొప్పున గత జనవరి 26న ప్రభుత్వం ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించిందన్నారు.బేస్మెంట్ స్థాయి వరకు నిర్మాణం పూర్తయితే లక్ష రూపాయలు, పైకప్పు స్థాయి దాటిన తర్వాత లక్ష రూపాయలు, స్లాబ్ పూర్తయ్యాక రూ. 2 లక్షలు, మొత్తం పనులు పూర్తయ్యాక మిగిలిన లక్ష రూపాయలతో కలిపి ఇలా మొత్తం రూ. 5 లక్షలను ప్రభుత్వం లబ్ధిదారులకు చెల్లిస్తోందన్నారు.పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాలో మొదటి విడతలో భాగంగా మొత్తం (2285) మంది లబ్ధిదారులను గుర్తించామన్నారు.ఇందులో (340) మంది ఇళ్ల నిర్మాణాలకు మార్కింగ్ చేయగా, (45) మంది లబ్ధిదారులకు బేస్మెంట్ స్థాయి వరకు ఇళ్ల నిర్మాణం జరిగిందన్నారు.ఇందులో భాగంగా తొలి విడతగా.. బేస్మెంట్ దశ నిర్మాణం పూర్తి చేసుకున్న వారికి లక్ష రూపాయల చొప్పున ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని, జిల్లాకు సంబంధించి బెస్మెంట్ పూర్తయిన నిర్మాణాలకు ఇప్పటివరకు మొత్తం (26) మంది లబ్ధిదారులకు రూ. లక్ష చొప్పునఈ నెల 15 న రాష్ట్ర ముఖ్య మంత్రి చేతుల మీదుగా చెక్కులు అందజేశారు. 26 లక్షలు వారి అకౌంట్లలోకి ప్రభుత్వం నగదు జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. మిగతా లబ్ధిదారులకు కూడా జమ అవుతాయన్నారు. మిగతా లబ్ధిదారులు త్వరతగతిన బేస్ మెంట్ నిర్మాణం పూర్తి అయిన వారు తదుపరి పి నిర్మాణం పనులు మొదలు పెట్టాలని, మిగతా వాటికీ ఋణం మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. రెండవ దశ లో లబ్ధిదారుల ఎంపిక జరుపబడుతుందని తెలిపారు.మిగిలిన గ్రామాల్లో కూడా అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఈ నెల 22 నుంచి 30వ తేదీ లోపు మండల స్థాయి అధికారులు పరిశీలన ప్రక్రియను పూర్తిచేసి, మే 2వ తేదీన గ్రామ పంచాయతీ/వార్డు కార్యాలయాల్లో లబ్ధిదారుల జాబితాను ప్రదర్శిస్తామని, మే 5వ తేదీన అర్హులైన లబ్ధిదారులకు మంజూరు ఇస్తామని కలెక్టర్ తెలిపారు.

# క్యూబ్ ఫోర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో

## జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కిచెన్ షెడ్ ప్రారంభం






అబ్దుల్లాపూర్‌మెట్టు / నగరనిజం: అబ్దుల్లాపూర్ మెట్టు మండలం కోహెడలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ హై స్కూల్‌లో క్యూబ్ ఫోర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 4.50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన కిచెన్‌షెడ్ ప్రారంభోత్సవము కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో దాత కందాల గోవర్ధన్ రెడ్డి నేతృత్వం వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి క్యూబ్ ఫోర్ ఫౌండేషన్ నిర్వాహకుడు కుశల్ రెడ్డి కందాలతో కలిసి కిచెన్ షెడ్ నిర్మాణానికి ప్రారంభం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు క్యూబ్ ఫోర్ ఫౌండేషన్ చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కోహెడ గ్రామంలోని పాఠశాల అభివృద్ధి క్రమంలో గత 10 సంవత్సరాల క్రితం తాను నిర్మించిన గదులు తప్ప కొత్తగా ఏమీ అభివృద్ధి జరగలేదన్నారు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అనే పరిస్థితి ఈ పాఠశాలలో కనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ప్రభుత్వ బడుల అభివృద్ధికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందన్నారు.క్యూబ్ ఫోర్ ఫౌండేషన్ నిర్వాహకులు మాట్లాడుతూ, పాఠశాలలో మిడ్ డే మీల్ కోసం సురక్షిత వంటశాల నిర్మాణం ఎంతో అవసరమైందని, తాము ఈ పనిని స్వచ్ఛందంగా చేపట్టినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సందీప్ గౌడ్, ధనరాజ్ గౌడ్, హయత్ నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్, ఎస్సై వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# నిర్మాణ కార్మికుల డిమాండ్లపై ప్రెస్ మీట్




అబ్దుల్లాపూర్‌మెట్టు / నగరనిజం:రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్టు మండలం రావి నారాయణరెడ్డి కాలనీ-3లోని సిపిఐ పార్టీ కార్యాలయంలో ఈరోజు ప్రెస్ మీట్ నిర్వహించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ అబ్దుల్లాపూర్ మెట్టు మండల సమితి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ నెల 21, 22 తేదీల్లో శంషాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర మాసభలను విజయవంతం చేయాలని కోరుతూ ఈ సమావేశం జరిగింది.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా మాట్లాడిన సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ముత్యాల యాదిరెడ్డి భవన నిర్మాణ కార్మికుల హక్కుల కోసం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్మికులందరికీ ఇంద్రమ్మ ఇళ్లను కట్టించి ఇవ్వాలని, విద్య, వైద్యాన్ని ఉచితంగా అందించాలని, 50 ఏళ్లు దాటిన ప్రతి కార్మికుడికి నెలకు పది వేల రూపాయలు పెన్షన్ ఇవ్వాలని, పని చేస్తూ మృతి చెందిన కార్మికులకు పది లక్షల రూపాయలు పరిహారం అందించాలన్నారు. అలాగే డెలివరీ అయిన కార్మికురాళ్లకు 50 వేల రూపాయలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు అజ్మీరా హరి సింగ్ నాయక్, బిఓసి జిల్లా అధ్యక్షుడు దాసరి ప్రసాద్, కోశాధికారి కేతరాజు నరసింహ, ధూపం నిరంజన్, సాకలి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

Edited & printed and owner,publisher aela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed Y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor aela purushotham.(H.O) : plot no:31,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.(PRGI) .PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

# జగదీశ్వరి పాఠశాల విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్






నగరనిజం / కొత్తపేట: కొత్తపెట డివిజన్,పరిధిలోని న్యూ మారుతి నగర్ జగదీశ్వరి పాఠశాల విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే సెలబ్రేషన్ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం విద్యార్థులకు కార్పొరేటర్ పవన్ కుమార్ మరియు స్కూల్ ప్రిన్సిపాల్ నర్సిరెడ్డి చేతుల మీదుగా విద్యార్థులకు మెడల్స్ మరియు పట్టాలు ఇవ్వడం జరిగింది. అనంతరం పథకాలు అందుకున్న విద్యార్థులకు కార్పొరేటర్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నిరంకి రవి, ఠాకూర్ అశ్విన్ సింగ్, కొత్త తిరుమల, తోట మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# రన్ ఫర్ జీసస్ ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ తుమ్మల యుగంధర్





ఖమ్మం: ఏప్రిల్19,( నగర నిజం ప్రతినిధి ):ఖమ్మం జిల్లా గుడ్ ఫ్రైడే , ఈస్టర్ పండుగ సందర్భంగా ఎన్టీఆర్ సర్కిల్ నుండి క్రైస్తవులు రన్ ఫర్ జీసస్ ర్యాలీని జిల్లా కన్వీనర్ పాస్టర్ చల్లగుండ్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తుమ్మల యుగంధర్ , తుంపాల కృష్ణ మోహన్ లు పాల్గొని జండా ఊపి ప్రారంభించారు . ఈ సందర్భంగా ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలిపి యేసు క్రీస్తు ప్రభువు మరణించి తిరిగి బ్రతకడం గొప్ప విషయం . ఈ గొప్ప దేవుడిని మనం ఆరాధించడం చాలా మంచిది . ప్రభువు ఆశీర్వాదాలు మనకందరికీ వుండాలని ఆకాంక్షించారు . జి టి ఎస్ ఎస్ సంస్థ రెవరెండ్ బిషప్ జాకబ్ ప్రారంభం ప్రార్థన చేశారు .ఈ ర్యాలి ఖమ్మం పట్టణములోని ఎన్టీఆర్ సర్కిల్ నుండి ట్యాంక్ బండ్ వరకు కొనసాగింది . ఈ కార్యక్రమములో చాలా మంది ప్రముఖులు పాస్టర్స్ ఎర్నెస్ట్ పాల్ ఏర్పుల ప్రభాకర్ రావు జాకబ్ ఐపిసి ప్రభు ప్రకాష్ వేముల సత్యం చిన్ని డేవిడ్ రమేష్ పాల్ జయరావు సురేష్ ఆనంద్ పాల్ తిమోతి బాలస్వామి పాల్ సంజీవరావు పాల్ రాజ్ సామ్యేల్ ఫిన్ని రవికిరణ్ ఐజెక్ శ్యామ్ బాబు పాల్ చర్చి పెద్దలు , క్రైస్తవులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొని రన్ ఫర్ జీసస్ ర్యాలీని విజయవంతం చేశారు .

## విశ్వహిందూ పరిషత్ ఖమ్మం ఆధ్వర్యంలో పశ్చిమ బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించి హిందువులకు రక్షణ కల్పించాలనే నినాదం తో నిరసన ప్రదర్శన





ఖమ్మం: ఏప్రిల్ 19, ( నగర నిజం ప్రతినిధి ):ఖమ్మం జిల్లా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ వద్ద హిందువుల ఐక్యమత్యము నిరూపించుకోవాలని ఎన్నో హిందూ సంఘాల నాయకులు , ధార్మిక సంస్థల నాయకులు , వందలాది హిందువులు కదిలి వచ్చారు . ఈ నిరసన కార్యక్రమం లో హిందువు ల పై జరుగుతున్న హింస ఆపాలి అంటూ నినాదాలు చేస్తూ తక్షణమే పశ్చిమ బెంగాల్ లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమం లో అన్ని హిందూ సంఘాలు పాల్గొన్నాయి . ఈ విషయాన్ని ఖమ్మం జిల్లా కలెక్టర్ కి వినతి పత్రం అందచేయటం జరిగింది . ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బోనాల రామకృష్ణ , విభాగ కార్యదర్శి బాలాజీ , ఉపాధ్యకుడు శ్రీనివాస్ కార్యదర్శి కృష్ణ కోశాధికారి రవి దుర్గవాయిని మాతృశక్తి సభ్యులు మరియు ముఖ్య అతిథిగా కేంద్ర పరిషత్ గో రక్ష ప్రముఖ్ కేశవరాజ్ పాల్గొన్నారు .

# సోనియా గాంధీ,రాహుల్ గాంధీ రాజ్యాంగానికి అతిథులు ఏమి కాదు



బడంగ్పేట్ ఏప్రిల్ 19 (నగరనిజం) దేశ ప్రధాని నరేంద్ర మోడీ,కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పై %మీాజ% అద్దంకి దయాకర్,మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ వారిని అరెస్టు చేయాలని మీర్ పేట్ పోలీస్ స్టేషన్ సీఐ నాగరాజుకు ఫిర్యాదు చేసిన రంగారెడ్డి జిల్లా బీజేవైఎం వైస్ ప్రెసిడెంట్ చింతల రాఘవేందర్.సోనియాగాంధీ,రాహుల్ గాంధీ తప్పు చేయకుంటే ఈడి విచారణకు హాజరు కాకుండా ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే చూస్తూ ఊరుకోమని తగిన బుద్ధి చెబుతామని చింతల రాఘవేందర్ హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీకి ఇచ్చిన హామీలను అమలు చేయడం చేతకాక ప్రజలను డైవర్ట్ చేయడానికి ఇలాంటి చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.సోనియాగాంధీ,రాహుల్ గాంధీ రాజ్యాంగానికి అతిథులు ఏమి కాదని విచారణకు హాజరై తమ చిత్త శుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు.వెంటనే ఎఫ్ఆర్ నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మీర్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ క్లస్టర్ 2 బిజెపిఅధ్యక్షుడు ముఖేష్ ముదిరాజ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ కరుణానిధి, స్టేట్ ఆఫీస్ హైందవి దేవి రెడ్డి, విక్కీ సాగర్, కసిరెడ్డి వెంకటరెడ్డి, విజేందర్ కుమార్ బిట్టు, బీజేవైఎం నాయకులు పవన్, కృష్ణ, రాఘవేందర్ గౌడ్, మనీష్ ముదిరాజ్, సాయి, తదితరులు పాల్గొన్నారు.

# టైల్స్ కట్టింగ్ యంత్రం విషయమై గొడవ -ద్విచక్రవాహనం దగ్ధం-

నాగోల్ / నగర నిజం: నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని తట్టిఆన్నారం రేణుక వైన్స్ వద్ద ఓ కార్మికుడితో యజమాని మధ్య గొడవ చోటుచేసుకొని, అనంతరం ద్విచక్రవాహనం దగ్ధమైన ఘటన జరిగింది.ఫిర్యాదు వివరాల ప్రకారం, తట్టిఆ న్నారం నాగోల్కు చెందిన షేక్ మహబూబ్ బాషా అనే మేస్త్రీ రాత్రి సమయంలో తన పని చేసే సహచరుడు షేక్ మౌలాలీతో కలిసి మద్యం సేవించేందుకు తట్టిఆన్నారం రేణుక వైన్స్కు వెళ్లాడు. వీరిద్దరూ( ఏపీ 12 ఈ 8072 )నంబరు ఉన్న ద్విచక్రవాహనంపై అక్కడికి వెళ్లారు. కొద్దిసేపటికి ఆయన వద్ద పనిచేసే మరో ఇద్దరు కార్మికులు –షేక్ నూర్ బాషా, సురేష్ – (ఏపీ 21 ఏక్యూఎ 0616) నంబరు ఉన్న పల్సర్ ద్విచక్రవాహనంపై అక్కడకు వచ్చారు.అందరూ కలిసి ఉండగా, షేక్ నూర్ బాషా టైల్స్ కట్టే యంత్రాన్ని దెబ్బతీశాడని కారణంగా మహబూబ్ బాషా అతనితో గొడవపడ్డాడు. ఆ కోపంలో అతని చేతిలో ఉన్న ద్విచక్రవాహన తాళం తీసుకుని, తానే తీసుకొచ్చిన ద్విచక్రవాహనాన్ని అక్కడే వదిలేసి, పల్సర్పై వెళ్లిపోయాడు.కొద్ది సేపటికి రేణుక వైన్స్ వద్ద వదిలిన ద్విచక్రవాహనం నిప్పంటుకొని దగ్ధమవుతోందని సమాచారం వచ్చింది. వెంటనే అక్కడకు వెళ్లిన ఫిర్యాదు దారుడు అది పూర్తిగా కాలిపోయినట్టు గుర్తించాడు. ఈ ఘటనకు షేక్ నూర్ బాషా కారణమై ఉంటాడని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు ఒక ప్రకటనలో తెలిపారు.

# పదవి విరమణ సన్మాన మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ఖమ్మంజిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు బోయిన వేణు



ఖమ్మం: ఏప్రిల్ 19, ( నగర నిజం ప్రతినిధి ):పాలేరు నియోజకవర్గం నేలకొండపల్లి మండలం రాయిగూడెం గ్రామ జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్లో ఉపాధ్యాయుగా పనిచేస్తున్న మల్లు పురుషోత్తమరావు పదవి విరమణ సన్మానోత్సవ కార్యక్రమంలో ఖమ్మంజిల్లా కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ ఉపాధ్యక్షులు బోయిన వేణు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నంబూరి నరేష్ పతనపు నాగయ్య బోయిన రేణుకా రావు గాలం వీరబాబు దేగల రోశయ్య పగిడి పత్తి బ్రహ్మం బోయిన వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ యువ నాయకుడు మాటేటి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మాజీ మంత్రివర్యులు పువ్వాడ అజయ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది





ఖమ్మం: ఏప్రిల్ 19, ( నగర నిజం ప్రతినిధి ):ఖమ్మం : మాజీ మంత్రివర్యులు పువ్వాడా అజయ్ కుమార్ జన్మదిన సందర్భముగా టిఆర్ఎస్ యువ నాయకుడు మాటేటి కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో తొలుత భారీ బైకు ర్యాలీ మమత లోని మాజీ మంత్రి వారి నివాసం వరకు నిర్వహించి అజయ్ కుమార్ తో కేక్ కట్ చేపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది . తరువాత ప్రభుత్వాసుపత్రి నందు మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్ , టిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ కర్నాటి కృష్ణ , డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మక్బూ ముఖ్య అతిథులుగా విచ్చేసి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది . ఈ కార్యక్రమంలో కళ్యాణ్ సాయి వియుకే ప్రాంక్ ఉపేందర్ ఖమ్మం అప్డేట్స్ పవన్ వరుణ్ నజీర్ కళ్యాణ్ చందు గండికోట ఉపేందర్ నవీన్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

# భద్రేశ్వర జాతరలో అన్నదానం కార్యక్రమం నిర్వహించిన రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్

**స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన శుభప్రద్ పటేల్**







నగర నిజం తాండూర్ ప్రతినిధి ఏప్రిల్ 19:వికారాబాద్ జిల్లా తాండూరులో వెలసిన శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి జాతర అంగరంగ వైభవంగా శనివారం రోజు ప్రారంభమైంది. భక్తులు పెద్ద ఎత్తున హాజరై స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ జాతర ఉత్సవాల్లో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరంఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా శుభప్రద్ పటేల్ మాట్లాడుతూ భద్రేశ్వర స్వామి జాతరలో అన్నదానం నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. భద్రేశ్వర స్వామి ఆశీస్సులతోతాండూర్ ప్రాంత ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించినట్లు శుభప్రద్ పటేల్ తెలుపారు.ఈ కార్యక్రమంలో , జడ్పీ మాజీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, ఆలయ ఈవో శేఖర్ గౌడ్, ఆలయ చైర్మన్ పటేల్ కిరణ్ , మాజీ చైర్మన్ బంటారం సుధాకర్, వీరశైవ సమాజ ప్రెసిడెంట్. ఆర్ బస్వారాజ్, వాలి శాంత్ కుమార్, జొన్నల బస్వారాజ్, విజయకుమార్, మాజీ కౌన్సిల్లర్లు సోమశేఖర్ , గుండప్ప , శ్రీధర్ , గంజ్ అసోసియేషన్ నాయకులు రాంరెడ్డి , శంకర్, బాల్ రాజ్ గౌడ్, విశ్వనాథం, వీరశైవ యువ దళ్ ప్రెసిడెంట్ శశాంక్ , చందు , శ్రావణ్, వినోద్, రామకృష్ణ, శ్రీనివాస్, నాయకులు పటేల్ విజయ్ కుమార్ , సుదర్శన్ గౌడ్ , లక్ష్మణ్ చారీ , శుభప్రద్ యువసేన సభ్యులు విజయ్, హరీష్, నరేష్ గౌడ్, చందు పటేల్ , నరేందర్ గౌడ్, నవీన్ మనోహర్ , రాము నాయక్ , రవీందర్ రెడ్డి స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# గల్ఫ్‌లో హత్యకు గురైన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది

## - ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవ్రతి-

- గల్ఫ్ నుండి హైదరాబాద్ చేరుకున్న కార్మికులు అష్టపు ప్రేమ్ సాగర్, స్వర్గం శ్రీనివాస్ మృతదేహాలు
- శంషాబాద్ విమానాశ్రయం వద్ద మృతులకు నివాళి అర్పించిన కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవ్రతి, ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ డాక్టర్ వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీమిరెడ్డి, కమిటీ సభ్యులు చెన్నమనేని శ్రీనివాసరావు, నంగి దేవేందర్ రెడ్డి
- మృతదేహాలను చూసి కన్నీటి పర్యంతమైన మృతుల కుటుంబ సభ్యులు
- శంషాబాద్ విమానాశ్రయం నుండి ప్రత్యేక అంబులెన్స్ ల ద్వారా మృతదేహాలను స్వగ్రామాలకు తరలించిన అధికారులు
- ఇటీవల గల్ఫ్ లో పాకిస్తానీ యువకుడి చేతిలో దారుణ హత్యకు గురైన కార్మికులు ప్రేమ్ సాగర్, స్వర్గం శ్రీనివాస్







రాజేంద్రనగర్,ఏప్రిల్ 19(నగరనిజం ప్రతినిధి):బతుకుదెరువు కోసం ఎడారి దేశానికి వెళ్లి పాకిస్తానీ యువకుడి చేతిలో దారుణ హత్యకు గురైన తెలంగాణ వాసులు అష్టపు ప్రేమ్ సాగర్, స్వర్గం శ్రీనివాస్ మృతదేహాలు ఎట్టకేలకు హైదరాబాద్ చేరుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవడంతో శనివారం నాడు కార్మికుల మృతదేహాలు హైదరాబాద్ చేరుకున్నాయి. ఎమిరెట్స్ విమానంలో శంషాబాద్ విమానాశ్రయానికి చేరుకున్న గల్ఫ్ కార్మికులు ప్రేమ్ సాగర్, శ్రీనివాస్ మృతదేహాలకు ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్, అంబాసిడర్ డాక్టర్ బి ఎం వినోద్ కుమార్, వైస్ చైర్మన్ మంద భీమిరెడ్డి, తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవ్రతి, ఎన్నారై అడ్వజేరి కమిటీ సభ్యులు చెన్నమనేని శ్రీనివాసరావు, నంగి దేవేందర్ రెడ్డి తదితర అధికారులు, నాయకులు ఘనంగా నివాళి అర్పించారు. నిర్మల్ జిల్లా సోన్ మండల కేంద్రానికి చెందిన అష్టపు ప్రేమ్ సాగర్ తో పాటు జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన స్వర్గం శ్రీనివాస్ బతుకు తెరువు కోసం గత కొంతకాలం క్రితం గల్ఫ్ కు వెళ్లారు.. అయితే గల్ఫ్ లోని ఓ బేకరీలో కార్మికులుగా పనిచేస్తున్న వీరిని ఇటీవల పాకిస్తాన్ కు చెందిన ఓ యువకుడు అత్యంత దారుణంగా హత్య చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో దారుణ హత్యకు గురైన ప్రేమ్ సాగర్, స్వర్గం శ్రీనివాస్ మృతదేహాలను స్వగ్రామాలకు తరలించడానికి దుబాయ్ లోని సామాజిక సేవకులు గుండెల్లి నర్సింలు ఎంతగానో కృషి









చేశారు. ఈ మేరకు మృతదేహాల తరలింపు కోసం బాధిత కుటుంబ సభ్యులను తెలంగాణ ప్రభుత్వంతో సమన్వయం చేయడానికి నరసింహులు తీవ్రంగా శ్రమించారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ ఫలితంగా మృతదేహాలు శనివారం నాడు హైదరాబాద్ చేరుకున్నాయి. ఈ సందర్భంగా శంషాబాద్ విమానాశ్రయం కార్గో టెర్మినల్ వద్ద మీడియాతో మాట్లాడిన ఎన్నారై అడ్వైజరీ కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఎం వినోద్ కుమార్, తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవ్రతి.... బతుకుదెరువు కోసం కువైట్ కు వెళ్లి పాకిస్తానీ చేతిలో హత్యకు గురైన ప్రేమ్ సాగర్, స్వర్గం శ్రీనివాస్ కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ప్రకటించారు. ఇప్పటికే జపాన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మృతుల కుటుంబాలకు ఐదు లక్షల ఎక్స్ గ్రేషియా అందించడంతో పాటు ఇతర సహాయక చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించినట్లు చెప్పారు. అంతేగాకుండా మృతుల కుటుంబాలకు చెందిన వారసులకు తక్షణమే ఔట్ సోర్సింగ్ ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారని డాక్టర్ వినోద్ కుమార్, అనిల్ ఈరవ్రతి వెల్లడించారు. అదేవిధంగా బతుకుదెరువు కోసం తెలంగాణ నుండి గల్ఫ్ బాట పట్టి ప్రాణాలు కోల్పోయిన దాదాపు 170 మంది కుటుంబాలకు సైతం ఒక్కో కుటుంబానికి 5 లక్షల చొప్పున ప్రభుత్వం ఆర్థిక సాయం అందించిందని వారు వివరించారు.

**• పెద్ద దిక్కును కోల్పోయాం ప్రభుత్వమే ఆదుకోవాలి - మృతుల కుటుంబ సభ్యులు**

మరోవైపు బతుకుదెరువు కోసం వలస వెళ్లి దుబాయిలో దారుణ హత్యకు గురైన వారి పిల్లలు, కుటుంబ సభ్యులు మీడియా ముందు భావోద్వేగానికి గురయ్యారు. తమ తండ్రులు దుబాయ్ లో కష్టపడి పంపించిన డబ్బులతో తాము చదువుకుంటున్నామని, ఇప్పుడు పెద్ద దిక్కును కోల్పోవడంతో తమ బతుకులు బజారున పడ్డాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు.

**• శంషాబాద్ నుండి స్వగ్రామాలకు మృతదేహాలు తరలింపు**

ఇదిలా ఉండగా గల్ఫ్ నుండి హైదరాబాద్ చేరుకున్న మృతులు అష్టపు ప్రేమ్ సాగర్, జగిత్యాల వాసి స్వర్గం శ్రీనివాస్ మృతదేహాలను అధికారులు ప్రత్యేక అంబులెన్స్‌లలో వారి స్వస్థలాలకు తరలించారు.

# శ్రీ జైమాతాది టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా మంచి ప్యాకేజ్‌తో కాశి, గుజరాత్ యాత్ర






తిరుమలగిరి/నగర నిజం : ప్రతి హిందువు తన జీవితకాలంలో ఒక్కసారైనా పవిత్ర గంగానది (ఉత్తర వాహిని) లో స్నానమాచరించి శ్రీ కాశీ విశ్వనాథుని దర్శించుకోవాలని కోరుకుంటారు. అటువంటి వారి కోసం శ్రీ జైమాతాది టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా ప్రతి రెండు నెలలకు ఒకసారి కాశీయాత్ర నిర్వహించబడుతుంది. దాంతోపాటు గుజరాత్ టూర్ కూడా ఉంటుందని ట్రావెల్స్ నిర్వాహకులు పనకంటి రాజ్ మోహన్ పంతులుగారు తెలిపారు. ప్రతి సంవత్సరంలో మొత్తం 6 ట్రిప్పులు ప్లాన్ చేశామని పిల్లలు, వృద్ధులు, దంపతులు, పునీతులు అందరు కూడా యాత్రలో పాల్గొనవచ్చని చాలామంది వృద్ధులు, మహిళలు ఎంత ఉత్సాహంగా 9 నిద్రలు కాశీలో చేయాలని కోరుకుంటారని అన్నారు. కాని పిల్లలకు సమయం లేక వారి కోరికను తీర్చుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. అలాంటి వారికి మా ట్రావెల్స్ ద్వారా చక్కగా యాత్ర జరిపించి క్షేమంగా తిరిగి చేరుస్తామని చెప్పారు.3 టైర్ ఎ.సి. రైలు ప్రయాణం, ఎ.సి. బస్సులు, నాన్. ఎ.సి. హోటల్ రూములో వసతి (షేరింగ్ పద్ధతిలో) మన తెలుగువారి శుద్ధ శాఖాహార భోజనం అవసరమైన చోట బ్రాహ్మణులను గైడును అరేంజ్ చేయగలుగుతామని అన్నారు. మేము స్వయంగా దగ్గరుండి అన్ని మందిరాలు దర్శింపచేస్తామని పితృకార్యాలు, రుద్రాభిషేకం, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం వేణి దానం (ప్రయాగ్ రాజ్) మొదలగు పూజలకు మన తెలుగు బ్రాహ్మణులను అరేంజ్ చేస్తామని తెలిపారు.గడచిన 4 సంవత్సరాల కాలంలో దాదాపు 1350 మందికి యాత్ర జరిపించి క్షేమంగా ఇల్లు చేర్చామని అన్నారు . ఒకవేళ మీ వద్ద కనీసం 20 మంది ఉన్నచో మేము మీ కొరకు ప్రత్యేకంగా గ్రూప్ టూర్ అరేంజ్ చేయగలమని తెలిపారు. కావున అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరుతూ మరిన్ని వివరాల కొరకు 9493641956 నెంబర్ కి సంప్రదించాల్సిందిగా కోరారు. జై మాతాదీ టూర్స్ అండ్ ట్రావెల్స్ ద్వారా మాకు చాలా విషయాలు తెలుసాయని , చక్కగా అన్ని మందిరాలు దర్శించుకున్నామని భోజనము చాలా బాగుందని ఎంతో కేరింగ్ గా చూసుకున్నారని టూర్ కి వెళ్లిన భక్తులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు.

# ఎల్బీనగర్‌లోని హెరిటేజ్ డోర్స్‌లో వివిధ రకాలైన డోర్లు మంచి క్వాలిటీతో లభ్యం






ఎల్బీనగర్/నగర నిజం : ఎల్బీనగర్ లో ప్రొప్రైటర్లు తూర్పాటి వెంకట్, తూర్పాటి రవి నేతృత్వంలో ఏర్పాటుచేసిన హెరిటేజ్ డోర్స్ లో వివిధ రకాలైన డోర్లు మంచి క్వాలిటీతో లభిస్తున్నాయి. ఈ సందర్భంగా ప్రొప్రైటర్ తూర్పాటి వెంకట్ మాట్లాడుతూ మా వద్ద 15 ఏళ్ల అపార అనుభవంతో మంచి క్వాలిటీలో అందుబాటు ధరల్లో టేక్ వుడ్ డోర్స్, లామినేటెడ్ డోర్స్, స్కిన్ డోర్స్, మౌల్డెడ్ డోర్స్, డబ్ల్యూ పిసి డోర్స్ అండ్ ఫ్రేమ్స్, కస్టమైస్డ్ డోర్స్ లభిస్తాయని అన్నారు. మరిన్ని వివరాల కొరకు 9849226656, 9553732348 నెంబర్లకు సంప్రదించాల్సిందిగా కోరారు.

# హయత్‌నగర్‌లోని ఎస్.ఆర్.ఎస్ అకాడమీలో సమ్మర్ క్యాంపు, రెగ్యులర్ క్లాసెస్ ప్రారంభం



హయత్ నగర్/నగర నిజం : హయత్ నగర్ లోని వినాయక్ నగర్ రోడ్ నెంబర్ 18లో చైర్మన్ లక్ష్మి నరసింహ రావు నేతృత్వంలో ఏర్పాటుచేసిన ఎస్.ఆర్.ఎస్ అకాడమీ లో సమ్మర్ క్యాంపు, రెగ్యులర్ క్లాసెస్ ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అకాడమీ నిర్వాహకులు మాట్లాడుతూ మావద్ద 20 ఏళ్ల అపార అనుభవంతో క్లాసికల్, వయోలిన్, గిటార్, ఆక్టోపాడ్, తబలా, కీబోర్డ్, చెస్, డే కేర్ సెంటర్ అండ్ ప్రీస్కూల్ అందుబాటు ఫీజుతో నేర్పించబడతాయని అన్నారు. అట్లాగే ఒకటవ తరగతి నుండి ఇంటర్మీడియట్ వరకు అన్ని సబ్జెక్టుల్లో ట్యూషన్లు చెప్పబడతాయని తెలిపారు. అదేవిధంగా ఎస్.ఆర్. ఎస్ అకాడమీ అనుబంధ సంస్థ జెకె ఇన్స్టిట్యూట్లో బ్యూటీషన్, టైలరింగ్, మెహందీ, ఫ్యాషన్, డిజైనింగ్, శ్లోకాస్, తెలుగు పోయెమ్స్, డ్రావింగ్, ఫిజికల్ యాక్టివిటీస్, జుంబా డ్యాన్స్, గేమ్స్, స్కిట్స్, హోంవర్క్ లో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని తెలిపారు. అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో అతి తక్కువ ఫీజుతో ఎక్కడికి తిరగాల్సిన అవసరం లేకుండా ఒకే చోట అన్ని కోర్సులు అందించే విధంగా ఈ అకాడమీని ఇక్కడ ఏర్పాటు చేశామని అన్నారు. కావున పరిసర ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కొరకు 7036726226, 9849181237 నెంబర్లకు సంప్రదించాల్సిందిగా కోరారు.



# ఘనంగా 25వ వివాహ వార్షికోత్సవ వేడుక

**వరగంటి రజిని కుమార్ స్వర్ణలత దాంపత్య జీవితానికి 25 వసంతాలు**

**కన్నుల పండుగగా జరిగిన వేడుక శుభాకాంక్షల వెల్లువ**



మొయినాబాద్, మార్చి 19 (నగర నిజం)మొయినాబాద్ మున్సిపాలిటీ అజీజ్ నగర్ పరిధిలో గల కంట్రీ సైడ్ రిసార్ట్ లో శనివారం పెళ్లిరోజు సందర్భంగా దంపతులు, వరగంటి రజిని కుమార్, స్వర్ణలత ,తమ 25వ వివాహ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి శ్రీధర్ రెడ్డి, శైలజ, అమర్నాథ్ రెడ్డి, గౌరీ, నర్సింగ్ రావు, స్రవంతి శేఖర్ రెడ్డి వాణి ,పాల్గొని దంపతులను ఆశీర్వదించారు శుభాకాంక్షలు తెలిపారు ఈ ప్రత్యేకమైన కార్యక్రమాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులు, మరియు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున హాజరై వేడుకను మరింత శోభాయమానం చేశారు. వేడుకలో కేక్ కట్ చేసి ఒకరికొకరు తినిపించుకోగా, అతిథులు శాలువా, బొక్కెలు అందజేసి దంపతులను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులు, స్నేహితులు, శ్రేయోభిలాషులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేసి, దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో పదికాలాలపాటు సంతోషంగా ఉండాలని ఆనందంగా, జీవించాలని ఆకాంక్షించారు.

# శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి రథానికి కలశాధారణ

## ముఖ్య అతిథిగా హాజరైన తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి







నగరనిజం తాండూర్ ప్రతినిధి ఏప్రిల్ 19 :వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలోని శ్రీ భావిగి భద్రేశ్వర స్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా శనివారం రోజు ప్రారంభమైయ్యే రథానికి కలశాధారణ పూజ కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కల్వ సుజాత, పట్లోళ్ల బాల్ రెడ్డి, పటేల్ కిరణ్, వడ్డే శ్రీనివాస్, గుళి పరమేశ్వర్, మల్లేశం, శరణు, ప్రభాకర్ గౌడ్, రాములు నాయక్, బంటు వేణు, బస్వరాజ్, నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Edited & printed and owner,publisher aela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor aela purushotham.(H.O) : plot no:31,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE

# ఘనంగా ముగిసిన శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున మరకత లింగ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు







నాగోల్ /నగర నిజం : నాగోల్ పరిధి మమత నగర్ బసవేశ్వర కాలనీలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున మరకత లింగస్వామి ఆలయంలో శ్రీశైల మల్లికార్జున సమాజోత్తన ఫౌండేషన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మూడు రోజుల్లో భాగంగా జరిగిన ఆలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం నాడు 18వ తేదీతో ఎంతో ఘనంగా ముగిసాయి. మూడు రోజులలో భాగంగా రెండు రోజులు విశేషమైన పూజలు నిర్వహించారు. మూడవ చివరి రోజు దేవాలయం పక్కనే గల ఖాళీ స్థలంలో నిర్మించ తలపెట్టిన వీరశైవధార్మిక భవన నిర్మాణానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన శ్రీశైలం, సూర్య సింహాసన పండితారాధ్య పీఠాధిపతి, డాక్టర్ చిన్న సిద్ధి రామ పండితారాధ్యుల వారి ఆధ్వర్యంలో భూదాతలు వాలి బసవరాజు చంద్రకళ దంపతులు, పలు ట్రస్ట్ సభ్యులు భూమి పూజ చేసారు. అనంతరం పీఠాధిపతులు ఆధ్యాత్మిక కార్యక్రమంలో అమృతమైన భాషనను చేశారు. భక్తులకు కొంగుబంగారై పిలుస్తూ భక్తుల సమస్త కోరికలను తీరుస్తున్న ఈ దేవాలయం నిత్య నూతనంగా అభివృద్ధి చెందుతూ ఉన్నదని వారు పేర్కొంటూ, దేవాలయ పరిసరములో నిర్మిస్తున్న ధార్మిక భవనములు, ఒక పాఠశాల, గ్రంథాలయం, ధర్మాచార్యుల వసతి నిలయము, అన్నదాన సత్రము, ధార్మిక కార్యక్రమాల నిర్వహించుకోవడానికి వీలుగా సమావేశ మందిరం, వసతులు ఉంటాయని వారు పేర్కొన్నారు. ఈ మందిరం దినదినాభివృద్ధి చెందాలని ప్రార్థించారు. తదనంతరం ముఖ్యఅతిథిగా విచ్చేసిన మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఈ ఆలయ వార్షికోత్సవానికి రావడం చాలా సంతోషంగా ఉందని కాశీలో ఎలా ఉందో అదేవిధంగా విధంగా ఈ ఆలయం నిర్మించబడిందని అంతే శక్తివంతమైనదని ఇలాంటి ధార్మిక భవనాలను నిర్మించడం వల్ల ఎంతోమందికి ఉపయోగపడుతుందని అన్నారు. హైందవ ధర్మం ఎల్లప్పుడూ వర్ధిల్లాలని ఆ పరమేశ్వరుడి దయవల్ల ప్రజలందరు బాగుండాలని కోరారు. ఈ ఆలయానికి తన వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ ప్రథమ వార్షికోత్సవం ఎంత ఘనంగా జరిగిందో దానికంటే ఘనంగా ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని ఆశాభవం వ్యక్తం చేశారు. తెలంగాణకు ఈ ఆలయం మరో శ్రీశైలంలో గల శ్రీశైల భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయం అని అన్నారు. అంతటి శక్తివంతమైన ఆలయమని పేర్కొన్నారు. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన ముఖ్య అతిథులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా నాలుగవ రోజు శనివారం నాడు ఎమ్మెల్సీ కోదండరాం పాల్గొన్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వీర మల్లేశం, జగదేవ్ వీరమట్, వాలి బస్వరాజ్, కర్ణాకర్, వి. నాగ భూషణం, మహిళ అధ్యక్షురాలు రుద్రమదేవి, అన్నపూర్ణ, తదితర కమిటీ సభ్యులు, హైద్రాబాద్ వివిధ సమాజాల కార్యవర్గ సభ్యులు, మిగతా మహిళా కమిటీ సభ్యులు, వీర శైవ లింగాయత్ బంధుమిత్రులు, కాలనీ వాసులు, ఇతర కాలనీవాసులు, స్థానిక నాయకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం






నగర నిజం తాండూర్ ప్రతినిధి ఏప్రిల్ 19:రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమనితాండూర్ ఎమ్మెల్యే బు య్యని మనోహర్ రెడ్డి అన్నారు.శనివారం వికారాబాద్ జిల్లా యాలాల మండలం దేవనూర్, విశ్వనాథ్ పూర్ గ్రామాలలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రతి గింజను కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని.. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఒక్కొకటి అమలు చేస్తుందని, ఉన్నత వర్గాల వారు తిన్నట్లె పేదలకు కూడా సన్నబియ్యం ఇవ్వాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. అలాగే సన్నరకం వరి పండించిన రైతులకు రూ. 500లు బోనస్ ఇస్తున్నామని రైతులు దళారులకు వద్దు అమ్మి మోసపోవద్దని, ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మి గిట్టుబాటు ధర పొందాలని ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచించారు. ఇందిరమ్మ రాజ్యంలో రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారని అన్నారుఈ కార్యక్రమంలో తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, పెద్దేముల్ మాజీ జడ్పి టీసీ దారాసింగ్,యాలాల పిఏసిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, యాలాల మండల కాంగ్రెస్మాజీ అధ్యక్షులు బీమప్ప, యాలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సిరెడ్డి, హన్మంతు, ఖాసీం, వడ్ల శ్రీనివాస్, తాండూర్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ కుమార్,యాలాల మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రఫిక్, విశ్వనాథ్ పూర్ కి చెందిన నాయకులు జి.రవీందర్, అబ్దుల్ ఖాదర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# -హత్యకు దారి తీసిన ఆన్‌లైన్ గేమ్ -

## శంషాబాద్ ఇన్చార్జి డీసీపీ చింతమనేని శ్రీనివాస్

- షాద్నగర్ లో సుపారీ హత్య కేసును చేధించిన పోలీసులు
- ప్రధాన నిందితుడు శాఖమూరి వెంకటేష్ అరెస్ట్
- పరారీలో ఐదుగురు సుఫారీ గ్యాంగ్
- కారు తోపాటు మూడు మొబైల్ ఫోన్లు సీజ్
- షాద్నగర్ పోలీసులను అభినందించిన డీసీపీ చింతమనేని శ్రీనివాస్





రాజేంద్రనగర్, ఏప్రిల్ 19(నగరనిజం ప్రతినిధి):రంగారెడ్డి జిల్లా శంషాబాద్ జోన్ పరిధిలోని షాద్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సుఫారి హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. సుఫారి ఇచ్చి కిలరి సాయి రాహుల్ హత్యకు పాల్పడ్డ ప్రధాన నిందితుడు శాఖమూరి వెంకటేష్ ను అరెస్టు చేసిన పోలీసులు.... హత్యకు నిందితులు ఉపయోగించిన ఓ కారు తో పాటు మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మరోవైపు పరారీలో ఉన్న మరో ఐదుగురు సుపారి నిందితుల కోసం గాలిస్తున్నట్లు శంషాబాద్ జోన్ ఇన్చార్జి డీసీపీ చింతమనేని శ్రీనివాస్ ప్రకటించారు. ఈ మేరకు శనివారం నాడు శంషాబాద్ డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో చింతమనేని శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. డీసీపీ చింతమనేని శ్రీనివాస్ కథనం ప్రకారం షాద్నగర్ సుఫారి హత్యకు సంబంధించిన వివరాలు....పూర్వాపరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నంద్యాల పరిధిలోని చిన్న దేవలాపురం ప్రాంతానికి చెందిన హతుడు కిలరి సాయి రాహుల్(23), ప్రధాన నిందితుడు శాఖమూరి వెంకటేష్ అలియాస్ గుల్లి(23) ఇద్దరు స్నేహితులు. అయితే ఈజీ మనీ కోసం ఆన్ లైన్ గేమింగ్ కు అలవాటు పడ్డ హతుడు సాయి రాహుల్.... ఏడాది క్రితం తను స్నేహితుడైన శాఖమూరి వెంకటేష్ కు ఆన్ లైన్ గేమ్ రుచి చూపించాడు. ఆన్ లైన్ గేమ్ ద్వారా లక్షాధికారి కావచ్చునని స్నేహితుడికి ఆశలు కల్పించాడు.ఇంకేముంది సాయి రాహుల్ మాటలకు ఇంప్రెస్ అయిన శాఖమూరి వెంకటేష్.... ఏడాది క్రితం లెవెన్ విన్నర్స్ ఆన్ లైన్ క్యాషినో అనే ఆన్ లైన్ గేమ్ ఆడాడు. స్నేహితుడి తప్పుడు సలహాతో ఆన్ లైన్ బెట్టింగ్ గేమ్ కు అలవాటు పడ్డ వెంకటేష్ దాదాపు 15 లక్షలు పోగొట్టుకున్నాడు. దీంతో వెంకటేష్ తీవ్ర నిరాశ నిస్పృహలకు లోనయ్యాడు. ఇదిలా ఉండగా వారం రోజుల క్రితం మరోసారి స్నేహితుడు వెంకటేష్ ను కలిసిన సాయి రాహుల్.... ఈ సారి బెట్టింగ్ కాస్తే అదృష్ట లక్ష్మి గడప తట్టడం ఖాయమని మరోసారి ఉసిగొల్పాడు. ఇందుకు తనది గ్యారెంటీ అని నమ్మించాడు.అయితే అప్పటికే 15 లక్షలు పోగొట్టుకున్న వెంకటేష్... చివరి ప్రయత్నం గా మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి ఆన్ లైన్ బెట్టింగ్ లో పందెం కాసి 3 లక్షలు పోగొట్టుకున్నాడు. దీంతో స్నేహితుడు సాయి రాహుల్ పై వెంకటేష్ ఆగ్రహంతో ఊగిపోయాడు. నిన్ను నమ్మి డబ్బులు అన్ని పోగొట్టుకున్నాను తన డబ్బులు తనకు కావాలి అంటూ ఘర్షణ పడ్డాడు. డబ్బుల విషయంలో ఇద్దరి మధ్యన మాటా మాటా పెరిగి హత్యకు దారి తీసినట్లు డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వెల్లడించారు. ఆన్ లైన్ బెట్టింగ్ గేమ్ కు తనను బానిసగా మార్చి డబ్బులు పోగొట్టుకునేలా చేసిన సాయి రాహుల్ ను ఎలాగైనా అంతమొందించాలని వెంకటేష్ నిర్ణయించుకున్నాడు. ఈ మేరకు హైదరాబాద్ జీడిమెట్ల లోని సూరారం లో నివసించే తన స్నేహితుడి (కారు డ్రైవర్) ని కలిసి తన బాధ చెప్పుకున్నాడు. ఎలాగైనా సరే సాయి రాహుల్ ను హత్య చేయాలని నిర్ణయించుకున్న వెంకటేష్ తన స్నేహితుడైన కారు డ్రైవర్ తో కలిసి కుత్బుల్లాపూర్ వద్ద రోడ్డు పక్కన మూడు కత్తులు కొనుగోలు చేశాడు. అనంతరం సుఫారి గ్యాంగ్ సాయంతో ఏప్రిల్ 12వ తేదీన ఒక ఎర్టిగా కారు(నంబర్ టీఎస్ 30, ఏ 6338) ను అద్దెకు తీసుకున్నాడు వెంకటేష్. ఈ మేరకు అదే రోజు రాత్రి స్నేహితుడు సాయి రాహుల్ ను నమ్మించి రంగారెడ్డి జిల్లా షాద్నగర్ ఫరూక్ నగర్ లింగారెడ్డిగూడ శివారు ప్రాంతానికి రప్పించాడు. ఈ మేరకు అక్కడ సుఫారి గ్యాంగ్ తో కలసి అందరూ మద్యం సేవించారు. మద్యం మత్తు లోకి జారుకున్నాక కత్తులతో మెడను కోసి కడుపులో పొడిచి అత్యంత కిరాతకంగా హత్య చేశారు. అయితే హత్యకు సహకరించినందుకుగాను సుఫారి గ్యాంగ్ సభ్యులకు 50 వేల చొప్పున సమర్పించుకున్న ప్రధాన నిందితుడు వెంకటేష్.... తరువాత రెండు లక్షలు ఇస్తానని ఒప్పందం చేసుకొని అక్కడి నుండి జారుకున్నారు. అయితే గుర్తుతెలియని వ్యక్తిని గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసినట్లుగా కేసు నమోదు చేసిన పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టారు. అయితే ఈ హత్య స్థానికంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో శంషాబాద్ జోన్ అడిషనల్ డీసీపీ రామ్ కుమార్, షాద్నగర్ ఏసిపి హుస్సేన్ నాయుడు పర్యవేక్షణలో షాద్నగర్ ఇన్స్పెక్టర్ పి విజయ్ కుమార్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ ఎస్ వెంకటేశ్వర్లు, ఎస్సై శరత్ తో పాటు ఎస్ఓటి టెక్నికల్ ఇన్స్పెక్టర్ సంజయ్ కుమార్ ఈ హత్య కేసు మిస్టరీని ఛేదించినట్లు డీసీపీ చింతమనేని శ్రీనివాస్ వెల్లడించారు. శనివారం నాడు రాజేంద్రనగర్ పరిధి లోని ఆరాంఘర్ చౌరస్తా ప్రధాన నిందితు శాఖమూరి వెంకటేష్ ను అరెస్టు చేసి హత్య కోసం ఉపయోగించిన కారు తో పాటు 3 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు చింతమనేని శ్రీనివాస్ మీడియా వివరించారు. మరోవైపు తప్పించుకొని పరారీ లో ఉన్న మిగతా ఐదుగురు నిందితుల కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నట్లు, త్వరలోనే వారి అరెస్టు చేస్తామని ఆయన ప్రకటించారు.

- **షాద్నగర్ పోలీసులకు డీసీపీ చింతమనేని శ్రీనివాస్ ప్రశంస**

రంగారెడ్డి జిల్లా షాద్నగర్ పరిధిలోని లింగారెడ్డిగూడెం వద్ద సంచలనం సృష్టించిన నంద్యాల వాసి సాయి రాహుల్ సుఫారి హత్య కేసు మిస్టరీని ఛేదించిన షాద్నగర్ పోలీసులను శంషాబాద్ ఇన్చార్జి డీసీపీ చింతమనేని శ్రీనివాస్ అభినందించారు.

# శంషాబాద్ లో ఘనంగా టీడీపీ యువ నేత ధీరజ్‌గౌడ్ జన్మదిన వేడుకలు

- రాయల్ విల్లాస్ కాలనీలో కుటుంబ సభ్యులు అభిమానుల సమక్షంలో ఘనంగా ధీరజ్ గౌడ్ జన్మదిన వేడుకలు
- కారింగుల ధీరజ్ గౌడ్ ను ఆశీర్వదించిన టీడీపీ నేత కారింగుల దేవానంద్ గౌడ్,బీజేపీ నేత కొండా పరమేష్ గౌడ్, తుడుం జగన్, దేవేందర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ సహా వివిధ పార్టీల నేతలు




రాజేంద్రనగర్, ఏప్రిల్ 19(నగరనిజం ప్రతినిధి):రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపాలిటీ కి చెందిన టీడీపీ యువ నేత కారింగుల ధీరజ్ గౌడ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం రాత్రి శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కిషన్ గూడ రాయల్ విల్లాస్ కాలనీ లో కుటుంబ సభ్యులు, అభిమానుల సమక్షంలో ధీరజ్ గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు ఊటుపల్లి మాజీ ఉపసర్పంచ్, టీడీపీ సీనియర్ నేత కారింగుల దేవానంద్ గౌడ్ అలియాస్ నందు,బీజేపీ సీనియర్ నేత కొండా పరమేష్ గౌడ్,మాజీ ఉపసర్పంచ్ తుడుం జగన్, స్థానిక నేతలు దేవేందర్ గౌడ్, కారింగుల శ్రీనివాస్ గౌడ్, శశి గౌడ్ తదితర నేతలు ధీరజ్ గౌడ్ చేత కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు షాలువా కప్పి అభినందించారు. దేవుడి ఆశీస్సులతో ధీరజ్ గౌడ్ నిండు నూరేళ్లు చల్లగా వర్ధిల్లాలని టీడీపీ నేత ధీరజ్ గౌడ్ తండ్రి కారింగుల దేవానంద్ గౌడ్ ఆశీర్వదించారు.

- **నాయకులకు కృతజ్ఞతలు తెలిపిన ధీరజ్ గౌడ్**

తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఆశీర్వదించిన తన తండ్రి దేవానంద్ గౌడ్ తో పాటు వివిధ పార్టీల నేతలు కొండ పరమేష్ గౌడ్, తుడుం జగన్, దేవేందర్ గౌడ్,కారింగుల శ్రీనివాస్ గౌడ్, శశి గౌడ్ తదితర నేతలకు ధీరజ్ గౌడ్ కృతజ్ఞతలు చెప్పారు.

నగరనిజం



# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి. .



నగర నిజం తాండూర్ ప్రతినిధి ఏప్రిల్ 19::::(యాలాల, సంగం కుర్దు):వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకో వాలని తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారంయాలాల్ మండల కేంద్రంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న వడ్ల వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. అదేవిదంగా మండల పరిధిలోని సంగం కుర్దు గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యేప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యేమాట్లాడుతూ.. ఆరుగాలం రైతులు కష్టించి పండించిన వరి ధాన్యాన్ని కేంద్రాలకు తీసుక వచ్చి మద్దతు ధర పొందాలని అన్నారు. దళారీలకు విక్రయించి మోసాలకు గురికావద్దని తెలిపారు. రైతులకు కొనుగోలు కేంద్రాల వద్ద ఇబ్బందులు కలుగనీయ కుండా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజరసలాం, తాండూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ బాల్ రెడ్డి, పెద్దేముల్ మాజీ జడ్పి టీసీ దారాసింగ్,యాలాల పిఏసిఎస్ చైర్మన్ సురేందర్ రెడ్డి, యాలాల మండల కాంగ్రెస్మాజీ అధ్యక్షులు బీమప్ప, యాలాల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నర్సిరెడ్డి, హన్మంతు, సంగేమ్ కుర్ధు సత్యనారాయణ, రాఘవేందర్ రెడ్డి, శ్రీనివాస్, నర్సింహా, మహేందర్, వెంకట్, వీరేశం, ఈ.వేంకటేశం, యాలాల మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు రఫిక్, తదితర నాయకులు పాల్గొన్నారు.

# అకాల వర్షానికి పంట నష్టం

## కోహెడ మండలంలోని గండి చెరువులో పరిశీలన



అబ్దుల్లాపూర్మెట్ / నగరనిజం : అకాల వర్షంతో పంటలు నేలరాలిన విషయం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్ చారి వ్యవసాయ అధికారులకు తెలియజేయడంతో అధికారులు గండి చెరువు గ్రామానికి వచ్చి పంట నష్టాన్ని పరిశీలించారు.వైస్ చైర్మన్ భాస్కర్ చారి, ఏఈఓ రఘు, గ్రామ రైతులతో కలిసి వరి తోపాటు కూరగాయల పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రఘు మాట్లాడుతూ 20 శాతం నుండి 50 శాతం వరకు పంట నష్టం జరిగిందని తెలిపారు. దాదాపు 20 ఎకరాల పైగా పంట నష్టాన్ని అంచనా వేసినట్టు పేర్కొన్నారు.ఈదురు గాలుల ప్రభావంతో గ్రామంలోని మామిడి చెట్లు, తాడి చెట్లు విరిగి పడిన ఘటనలు చోటుచేసుకున్నాయని తెలిపారు. నష్టంపై తగిన చర్యలు తీసుకునేందుకు సంబంధిత అధికారులకు నివేదిక ఇవ్వనున్నట్టు అధికారులు పేర్కొన్నారు.

# పశ్చిమ బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించాలి

- దిల్ సుఖ్ నగర్ రాజీవ్ చౌక్ వద్ద నిరసన ప్రదర్శన.
- మమతా బెనర్జీ దిష్టిబొమ్మ దగ్దం.
- పెద్ద ఎత్తున పాల్గొన్న విహెచ్పి, భజరంగ్ దళ్ శ్రేణులు.

హైదరాబాద్/నగరనిజం : పశ్చిమ బెంగాల్లో ముష్కర మూకలు హిందువుల పై దాడులు చేసి చంపడం దారుణమని, కేంద్ర ప్రభుత్వం వెంటనే అక్కడ రాష్ట్రపతి పాలన విధించాలని వి హెచ్ పి జాతీయ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, వివేకానంద జిల్లా అధ్యక్షులు పురుషోత్తమ్ రెడ్డి అన్నారు. పశ్చిమ బెంగాల్లో హిందువుల పై దాదులను ఖండిస్తూ శని వారం దిల్ సుఖ్ నగర్ రహదారి పై వి హెచ్ పి,భజరంగ్ దళ్ నిరసన కార్యక్రమం చేపట్టి, మమతా బెనర్జీ దిష్టిబొమ్మ దగ్దం చేశారు.వందలాది మంది వి హెచ్ పి,భజరంగ్ దళ్ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... వక్ఫ్ బోర్డు నవరణ బిల్లుకు వ్యతిరేకంగా కొందరూ ముష్కర మూకలు హిందువులపై దాడులు చేసి చంపారని, ఆస్తులను ధ్వంసం చేసి లూటీ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది మంది హిందువులు ఇండ్లను ఖాళీ చేసి పోయారని తెలిపారు. మమతా బెనర్జీ హిందువులకు రక్షణ కల్పించలేకపోతున్నారని, ఓటు బ్యాంక్ కోసం దేశ భద్రతకే ఆటంకంగా మారిందని వాపోయారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం పశ్చిమ బెంగాల్లో రాష్ట్రపతి పాలన విధించి హిందువులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డిఅన్నారం కార్పొరేటర్ ప్రేమ్ మాహేశ్వర్ రెడ్డి, సరూర్ నగర్ కార్పొరేటర్ శ్రీవాణి,చైతన్య పురి కార్పొరేటర్ రంగా నర్సింహ గుప్త, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ

## ఎల్.బి.నగర్ శాసనసభ్యులు .దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

హైదరాబాద్/నగరనిజం :ఎల్.బి.నగర్ శాసనసభ్యులు .దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వనస్థలిపురం డివిజన్ పరిధిలోని పార్థివాడా(పిట్టలబస్తి) బస్తీవాసుల కోరిక మేరకు అట్టి బస్తి నందు పర్యటించారు.ఈ సందర్భంగా బస్తివాసులు పలు సమస్యలను సుధీర్ రెడ్డి కి వివరించారు.ముఖ్యంగా డ్రైనేజీ సమస్యల కారణంగా చిన్నపాటి వర్షానికి డ్రైనేజీ పొంగిపొర్లుతున్నాయి అని అన్నారు.అలాగే రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు.వెంటనే స్పందించిన సుధీర్ రెడ్డి మీ యొక్క కాలనీ డ్రైనేజీ విషయంలో ఎవరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు. పక్కన ఫ్లై ఓవర్ నుంచి తీసుకొనిపోయి పక్కన ఉన్న కృష్ణ నగర్ పక్కన ఉన్న డ్రైన్స్ దగ్గర కలపడం జరుగుతుంది అని తెలిపారు.అనంతరం రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం చేయడం జరుగుతుందని తెలిపారు.ఇట్టి కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ భారస అధ్యక్షులు చింతల రవికుమార్,పార్ధివాడ కాలనీ అధ్యక్షులు శక్తి కిషోర్,బబ్లూ,అజయ్,రాజ్ కిరణ్,మహేష్,లోకేష్,ఊర్వశి తదితరులు పాల్గొన్నారు.

# రైతుకు భూమికి ఉన్న బంధమే భూ భారతి

## ఎమ్మెల్సీ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి




రంగారెడ్డి / నగరనిజం :శనివారం చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని పద్మావతి కన్వెన్షన్ హాల్, శంకర్ పల్లి బద్దం మాణిక్య రెడ్డి ఫంక్షన్ హాలు లో భూభారతి చట్టం-2025 పై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించడం జరిగింది.తెలంగాణ రాష్ట్ర చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, చేవెళ్ల శాసన సభ్యులు కాలే యాదయ్య, జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి లతో కలిసి పాల్గొన్నారు.నూతన చట్టానికి సంబంధించి ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చేవేళ్ళ ఆర్డీఓ చంద్రకళ చదివి వినిపించారు.ఈ సందర్భంగా చీఫ్ విప్ మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా రైతులకు, ప్రజలకు ఏవిధంగా న్యాయం జరుగుతుందని వివరించారు. ధరణి ద్వారా రైతులు ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కకున్నారు. సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. కొత్త ఆర్ఓఆర్ చట్టం ద్వారా అందరికీ న్యాయం జరుగుతుందని తెలిపారు.సదస్సులలో పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు కాలే యాదయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ పరిపాలనలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుడుతూ ధరణి స్థానంలో సరళమైన భూ భారతి పోర్టల్ ను ఈ నెల 14 డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి నాడు ప్రారంభించిందని అన్నారు. భూమి హక్కుల భద్రతకు, భూ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం భూ భారతి అమల్లోకి తెచ్చిందని అన్నారు.ఈ సదస్సులలో కలెక్టర్ పాల్గొని, భూభారతి చట్టం గురించి రైతులకు సవివరంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. ఎలాంటి వివాదాలకు తావు లేకుండా రైతులకు సంబంధించిన భూముల పై వారికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం ఆనేక కొత్త అంశాలను పొందుపరుస్తూ ఈ నూతన ఆర్.ఓ.ఆర్ చట్టాన్ని తెచ్చిందని వివరించారు. భూమి హక్కుల భద్రత, భూ సమస్యల సత్వర పరిష్కారం, రైతుల మేలు కోసం చారిత్రక మార్పు దిశగా ఈ నూతన ఆర్ఓఆర్ చట్టం ఉపకరిస్తుందని, రైతుల భూములకు భరోసా లభిస్తుందని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కల్పించే ఈ చట్టంపై అవగాహనను ఏర్పర్చుకోవాలని, భూ సమస్యలు కలిగిన రైతులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మే మొదటి వారం నుండి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాలలో భూభారతి చట్టాన్ని అమలు చేస్తారని అన్నారు. ఇందులో భాగంగానే జిల్లాలోని అన్ని రెవెన్యూగ్రామాలలో భూభారతి నూతన చట్టంపై సదస్సులు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించడం జరుగుతుంది అని తెలిపారు.భూ వివాదాల విషయంలో అప్పీలు చేసుకున్న పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం సమకూరుస్తారని సూచించారు. భూసమస్యల పరిష్కారానికి రెండంచెల వ్యవస్థ ఉంటుందని, ఈ చట్టం ద్వారా రైతులకు వారి భూముల వివరాలతో కూడిన భూధార్ కార్డులను కేటాయిస్తారని తెలిపారు. భూ సమస్యలు తెలుసుకుని సులభతరంగా పరిష్కరించేందుకు ఈ చట్టం ఉపయోగపడుతుందన్నారు. వ్యవసాయ భూములతో పాటు వ్యవసాయేతర, మిగితా అన్ని రకాల భూముల రికార్డులు రెవెన్యూ కార్యాలయంలో నమోదు అయి ఉంటాయని అన్నారు. ఇదివరకటి ధరణిలో రికార్డుల నిర్వహణ లేదని, ఇప్పుడు రికార్డుల నిర్వహణ ఉంటుందని, భూమి కలిగిన ప్రతి రైతుకు ఆధార్ కార్డు తరహాలో 'భూధార్' కార్డు ఇవ్వడం జరుగుతుందని అన్నారు. గతంలో ఏదైనా సమస్య పరిష్కారం కాకుంటే అప్పిల్ వ్యవస్థ లేదని సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని, ఇప్పుడు ఆర్డీఓ, కలెక్టర్, సీసీఎల్ఏ స్థాయిలలో అప్పీల్ వ్యవస్థ ఉందని, ప్రతి అంశం భూభారతి పోర్టల్ లో ఉంటుందని, ఎవరైనా వారి భూములకు సంబంధించిన వివరాలను పరిశీలించుకోవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా భూభారతి చట్టంలోని కీలక అంశాలైన భూ రికార్డులలో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, వారసత్వంగా వచ్చిన భూములకు మ్యుటేషన్, ఇతర మార్గాల ద్వారా వచ్చిన భూమికి మ్యుటేషన్, సాదా బైనామాల క్రమబద్దీకరణ, పట్టాదారు పాసు పుస్తకాలు, అప్పీల్ వ్యవస్థ, రివిజన్ అధికారాలు, గ్రామ రెవెన్యూ రికార్డులు, రికార్డుల నకలు పొందడం ఎలా అనే అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా రైతులకు సంబంధించిన భూ సమస్యలు పరిష్కారం అవుతాయని, ఇదివరకే ధరణి లో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులు పరిష్కారించడం జరుగుతుందని, మళ్ళీ దరఖాస్తులు చేసుకోవాల్సిన అవసరం లేదని తెలిపారు. మీకు ఏమైనా సమస్యలు ఎదురైనప్పుడు అప్పీలు చేసుకునేందుకు ఈ చట్టం అవకాశం కల్పించిందని అన్నారు.ఈ కార్యక్రమాలలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు పెంటయ్య గౌడ్, సురేందర్ , ప్రజా ప్రతినిధులు, అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# పరీక్ష కేంద్రాల వద్ద గుంపులుగా ఉండుదు

## సైబరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశం

### ఇంటర్మీడియట్, టీఎస్ ఓపెన్ స్కూల్ (టాస్) పబ్లిక్ పరీక్షలు

హైదరాబాద్ / నగరనిజం : ఇంటర్మీడియట్, టీఎస్ ఓపెన్ స్కూల్ (టాస్) పబ్లిక్ పరీక్షల సందర్భంగా ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు, ప్రజా శాంతి భద్రతలను కాపాడేందుకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మోహంతి ఆదేశాలు జారీ చేశారు.ఏప్రిల్ 20 నుండి మే 3 వరకు జరిగే పరీక్షల సమయంలో సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పరీక్షా కేంద్రాల పరిసరాల్లో గుంపులు (ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది) గుమిగూడడాన్ని నిషేధించారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఈ నిబంధన వర్తించనుంది.ఇంటర్మీడియట్, టాస్ పబ్లిక్ పరీక్షలు ఉదయం 9.00 నుండి మధ్యాహ్నం 1.00 వరకు, మధ్యాహ్నం 2.30 నుండి సాయంత్రం 5.30 వరకు జరగనున్నాయి. అలాగే, ప్రాక్టికల్ పరీక్షలు ఏప్రిల్ 26 నుండి మే 3 వరకు జరుగనున్నాయి.

- పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఫోటోకాపీ (జెరాక్స్), ఇంటర్నెట్ సెంటర్లు మూసివేయాల్సి ఉంటుంది.
- ఈ ఆదేశాల నుండి కింద ఉన్న విభాగాలు మినహాయించబడ్డాయి:
  - విధులలో ఉన్న పోలీసు అధికారులు
  - సైనిక సిబ్బంది
  - హోం గార్డులు
  - విద్యాశాఖకు చెందిన ఫ్లయింగ్ స్క్వాడ్
  - అంత్యక్రియల ఊరేగింపులు

ఈ ఆదేశాలు ఏప్రిల్ 20 ఉదయం 6 గంటల నుంచి మే 3 ఉదయం 6 గంటల వరకు అమల్లో ఉంటాయని కమిషనర్ తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారు 163 సెక్షన్ ప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు.

Edited & printed and owner,publisher aela purushotham,(Regd): H-No 11-21-890,Ntr Nagar,L.B nagar saroor nagar mandal,Rangareddy-Dist,500074, printed y.p.s publication H-No 11-21-890,Ntr Nagar,L.B nagar, saroor nagar mandal,Rangareddy-Dist,TELANGANA-500074, Editor aela purushotham.(H.O) : plot no:31,kuntloor road,Near hayathanagar,abdullapur mettu mandal,rangareddy dist,TELANGANA-501505,
RNI NO: APTEL/2013/54450.PH NO:8247467562 Email; nagaranijam@gmail.com.Whatsapp no : 8247467562,WEBSITE: WWW.NAGARANIJAM.COM.TELANGANA STATE